పెట్టుబడుల ఆకర్షణలో ఏపీనే అగ్రగామి

డీపీఐఐటీ జూలై నివేదికలో వెల్లడి



సాక్షి, అమరావతి: పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించడంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అతి పెద్ద ఘనత సాధించింది. 2022 సంవత్సరంలో పెట్టుబడుల ఆకర్షణలో దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ)జూలై నెల నివేదికలో ఆంధ్రప్రదేశ్ ప్రగతి విషయం వెల్లడైంది. ఈ ఏడాది తొలి ఏడు నెలల్లో దేశం మొత్తం మీద 1.71 లక్షల కోట్ల పెట్టుబడులు రాగా.. అందులో ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధికంగా రూ.40,361 కోట్ల పెట్టుబడులు వచ్చినట్టు ఆ నివేదిక పేర్కొంది. రూ.36,828 కోట్ల పెట్టుబడులతో ఒడిశా రెండో స్థానంలో నిలిచింది. దేశంలో పెట్టుబడుల్లో ఈ రెండు రాష్ట్రాలది 45 శాతం అని డీపీఐఐటీ తెలిపింది.

క్లుప్తంగా

26 నుంచి అక్టోబర్ 6 వరకు దసరా సెలవులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలకు ఈనెల 26 నుంచి దసరా సెలవులు ప్రారంభం కానున్నాయి. అక్టోబర్ 6 వరకు ఈ సెలవులుంటాయి. క్రిస్టియన్, మైనార్టీ స్కూళ్లకు మాత్రం అక్టోబర్ 1 నుంచి 6 వరకు సెలవులు ప్రకటించారు. స్కూళ్లు 7న తెరుచుకుంటాయి.

రాష్ట్రానికి 4 జైవిక్ ఇండియా అవార్డులు

సాక్షి, అమరావతి: ఆర్గానిక్ ఫుడ్ ఇండియా పోటీల్లో రాష్ట్రానికి నాలుగు ప్రతిష్టాత్మక పాన్ ఇండియా అవార్డులు లభించాయి. 2022–23 కి సంబంధించి జైవిక్ ఇండియా నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయ విస్తరణ కోసం కృషిచేస్తున్న రైతు సాధికార సంస్థకు జైవిక్ ఇండియా అవార్డు దక్కింది. రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీవోల) విభాగంలో పార్వతీపురానికి చెందిన మాభూమి ప్రకృతి వ్యవసాయ రైతు ఉత్పత్తిదారుల సంఘానికి, అల్లూరి సీతారామరాజు జిల్లా మాడుగులకు చెందిన నిట్టపుట్టు ప్రకృతి వ్యవసాయ రైతు ఉత్పత్తిదారుల సంఘానికి అవార్డులు లభించాయి. వ్యక్తిగత విభాగంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తున్న వైఎస్సార్ జిల్లాకు చెందిన బండి ఓబులమ్మకు అవార్డు దక్కింది. ఈ నెల 23న ఆగ్రాలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు.

అవార్డు రావడం ఆనందంగా ఉంది.



2016 నుంచి నేను ప్రకృతి సాగుచేస్తున్నా. ఎనిమిదెకరాల్లో నిమ్మ, రెండెకరాల్లో 10 రకాల కూరగాయలు సాగుచేస్తున్నా. ఎకరాకు రూ.4.80 లక్షలు ఖర్చవుతుండగా రూ.11.70 లక్షల ఆదాయం వస్తోంది. ప్రకృతి ఉత్పత్తులను సొంతంగా మార్కెటింగ్ కూడా చేసుకుంటున్నా. ప్రతిష్టాత్మక జైవిక్ ఇండియా అవార్డు లభించడం ఆనందంగా ఉంది.

– బండి ఓబులమ్మ,
టి.కొత్తపల్లి, వైఎస్సార్ జిల్లా

టీడీపీలో వర్గ పోరు

- బీసీలను అవమానించారంటూ బుద్దా, నాగుల్ మీరా నిరసన

సాక్షి ప్రతినిధి, విజయవాడ: టీడీపీలో వర్గపోరు మరోసారి బట్టబయలైంది. మంగళవారం ఇక్కడ జరిగిన కృష్ణా జిల్లా టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో పలువురు నేతలు నిరసన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బీసీలు, మైనార్టీలకు ప్రాతినిధ్యం కల్పించకపోవడం, ఫ్లెక్సీల్లో వారి ఫొటోలు లేకపోవడంతో కొందరు నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. బీసీలను అవమానించారంటూ ఆ పార్టీ నేతలు బుద్దా వెంకన్న, నాగుల్ మీరా నిరసన వ్యక్తం చేసి, సమావేశాన్ని బహిష్కరించారు. ఇక్కడి పరిస్థితులు చూసి జీవితంలో మొదటిసారి కన్నీళ్లు పెట్టుకున్నానని వెంకన్న వ్యాఖ్యానించారు. వీరిద్దరినీ సముదాయించడానికి కొందరు నేతలు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను వేదిక మీదకు పిలవకపోవడంపై ఆయన వర్గం నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సభలో కొంత గందరగోళం నెలకొంది. ఈ సమావేశానికి ఎంపీ కేశినేని నాని కూడా హాజరు కాలేదు. సమావేశంలో పాల్గొనడానికి ఇష్టం లేకే ఎంపీ ఢిల్లీ వెళ్లినట్లు సమాచారం.

నానో యూరియాపై అవగాహన కల్పించండి

సాక్షి, అమరావతి: నానో యూరియా వినియోగాన్ని పెంచేందుకు ఆర్బీకేల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ చేవూరు హరికిరణ్ చెప్పారు. అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎరువుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, డీఏపీ, యూరియా, పొటాష్ జిల్లాలకు సరిపడా సరఫరా చేస్తున్నామని తెలిపారు. పీఎం కిసాన్ కేవైసీ 68 శాతం పూర్తయిందని, 18వ తేదీలోపు ప్రతి జిల్లాలో 70శాతం పూర్తి చేయాలని ఆదేశించారు.

నాడు–నేడు దేశానికే ఆదర్శం

విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్

ఒంగోలు మెట్రో: ఆధునిక సౌకర్యాల నడుమ పిల్లలు చదువుకోవాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మనబడి నాడు–నేడు కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్ అన్నారు. మనబడి నాడు–నేడు రెండో విడతకు సంబంధించిన అవగాహన సదస్సు మంగళవారం ఒంగోలులో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధనవంతుల పిల్లలతో సమానంగా పేదల పిల్లలు కూడా ఆధునిక సౌకర్యాలు, తరగతి గదుల్లో విద్యనభ్యసించాలనే ఆశయంతో సీఎం జగన్ ఈ పథకానికి రూపకల్పన చేశారని చెప్పారు. గతంలో విద్యార్థినులు కాలకృత్యాలు తీర్చుకోవాలంటే.. సాయంత్రం ఇంటికి వెళ్లే వరకు వేచి ఉండాల్సిన దయనీయ పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు. అలాంటి కష్టాలకు ప్రభుత్వం చరమగీతం పాడిందన్నారు. ఇంటర్ విద్య కమిషనర్ ఎంవీ శేషగిరిరావు మాట్లాడుతూ.. నిర్ణీత గడువైన ఆరు నెలల్లోగా



మాట్లాడుతున్న విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్, ఇంటర్ విద్య కమిషనర్ శేషగిరిరావు తదితరులు

పనులు నాణ్యంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పథకం ఆచరణ గురించి ప్రత్యేక సలహాదారు ఆకునూరి మురళి వివరించారు. సమావేశంలో కలెక్టర్ దినేష్‌కుమార్, సమగ్ర శిక్ష చీఫ్ ఇంజినీర్ కె.శ్రీనివాసరావు, నాడు నేడు నోడల్ అధికారి సుశీల, ఇంటర్ విద్య ఆర్జేడీ సుబ్బారావు, అధికారులు ఎస్‌వీ సుబ్బారావు, కె.ఆంజనేయులు, సైమన్ విక్టర్, ప్రసాదరావు, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో రేషన్ డోర్ డెలివరీ భేష్

- వలంటీర్ల వ్యవస్థ, ఇంటింటికీ పంపిణీని ప్రశంసించిన కేంద్ర బృందం
- అన్నమయ్య జిల్లాలో రేషన్ షాపుల పరిశీలన
- లబ్ధిదారులు సైతం సంతృప్తి వ్యక్తం చేశారని వెల్లడి

మదనపల్లె: జాతీయ ఆహార భద్రత చట్టం అమల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో పౌర సరఫరాల వ్యవస్థ పనితీరు, రేషన్ డోర్ డెలివరీ, వలంటీర్ల వ్యవస్థ సమర్థంగా పనిచేస్తున్నాయని కేంద్ర బృందం సభ్యులు ప్రశంసించారు. జాతీయ ఆహారభద్రత చట్టం అమలు, పీడీఎస్ పంపిణీని క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసేందుకు నియమించిన కేంద్ర పరిశీలకుల బృందం మంగళవారం అన్నమయ్య జిల్లాలో పర్యటించింది. గాలివీడు, కురబలకోట, లక్కిరెడ్డిపల్లె, చిన్నమండ్యం, మదనపల్లె తదితర ప్రాంతాల్లో రేషన్ షాపులను తనిఖీచేసి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జాతీయ ఆహారభద్రత చట్టం సలహా సంఘం సభ్యులు జీఎస్ శర్మ, ఎంసీ చింపా మీడియాతో మాట్లాడుతూ దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆహార భద్రత చట్టం అమలు ఏపీలో బాగా జరుగుతోందని కితాబిచ్చారు. పౌరసరఫరాల పంపిణీకి ఎండీయూ వాహనాలు, వలంటీర్ల వ్యవస్థ, రేషన్ డోర్ డెలివరీ సత్ఫలితాన్నిస్తున్నాయని ప్రశంసించారు. 100కి 98శాతం మంది ప్రజలు రేషన్ దుకాణాల ద్వారా సరుకులు పొందుతున్నట్టు గుర్తించినట్టు తెలిపారు. రేషన్ సరుకుల పంపిణీపై లబ్ధిదారులను విచారిస్తే.. సేవలపై వారు సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు.



రేషన్ లబ్ధిదారులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం

క్యాన్సర్‌ను అణిచేద్దాం

▶ మొదటి పేజీ తరువాయి

కల్పించాలని చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖ కార్యకలాపాలపై మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. విజయవాడ, అనంతపురం, కాకినాడ, గుంటూరు ఆస్పత్రుల్లో 4 లైనాక్ మెషీన్లు (రేడియేషన్ ఇచ్చే యంత్రాలు) ఏర్పాటు చేయడానికి.. శ్రీకాకుళం, నెల్లూరు, ఒంగోలు ఆస్పత్రుల్లో లైనార్ బంకర్ల (వైద్య అవసరాలు తీర్చే గది.. ఉదా: హై ఎనర్జీ – ఎక్స్‌రే) నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మరో 7 పాత మెడికల్ కాలేజీల్లో కేన్సర్ శస్త్రచికిత్సల కోసం ఆపరేషన్ థియేటర్ల అప్‌గ్రేడేషన్, పాథాలజీ డిపార్ట్‌మెంట్లలో ఆధునిక సౌకర్యాలు, కీమో థెరపీ, డ్రగ్స్ తదితర సదుపాయాల కల్పనకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి టీచింగ్ ఆస్పత్రి ఆ జిల్లాకు సంబంధించిన వైద్య కార్యకలాపాలకు సెంటర్‌గా వ్యవహరించాలని, విలేజ్ క్లినిక్స్ దగ్గర నుంచి ఆ ఏరియాలో ఉన్న ప్రతి ఆస్పత్రి కూడా బోధనాస్పత్రి పరిధిలోకి రావాలన్నారు. దీనివల్ల క్యాన్సర్ లాంటి వ్యాధులను గుర్తించి, వైద్యం అందించడం సులభతరమవుతుందని చెప్పారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌లో 12 రకాల రాపిడ్ డయాగ్నోస్టిక్స్ కిట్లు, 67 రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. విలేజ్ క్లినిక్స్ విధివిధానాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి నాణ్యతపై నిరంతర పరిశీలన ఉండాలని, ప్రతి నెలా తప్పనిసరిగా నివేదికలు పంపాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పర్యవేక్షణకు జిల్లాల్లో ప్రత్యేక అధికారిని నియమించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో సీఎం ఇంకా ఏమన్నారంటే..

రక్తహీనత కేసులు ఉండకూడదు

- చిన్నారులు, మహిళల్లో రక్తహీనత నివారణకు ఇప్పటికే పలు చర్యలు తీసుకున్నాం. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం అందుతున్న తీరుపై నిరంతరం పర్యవేక్షణ చేయాలి. రక్తహీనత అధికంగా ఉన్న ప్రాంతాల్లో అదనంగా పౌష్టికాహారం అందించడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.
- వైద్యాధికారుల సిఫార్సు మేరకు వైద్య పరంగా, ఆహార పరంగా వారిపై దృష్టి పెట్టడం ద్వారా రాష్ట్రంలో రక్తహీనత కేసులు రాకుండా చూడాలి. వ్యవసాయానికి ఆర్బీకేలు ఎలా అండగా నిలుస్తున్నాయో ప్రజారోగ్యం విషయంలో విలేజ్ క్లినిక్‌లు కూడా అలాగే కీలక పాత్ర పోషించాలి. పీహెచ్‌సీలు, విలేజ్ క్లినిక్‌ల నిర్మాణం అనుకున్న రీతిలో పూర్తి చేయాలి.
- స్కూళ్లలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై నిరంతరం పర్యవేక్షణ జరగాలి. పిల్లల ఆరోగ్య పరిస్థితులను కనుక్కోవడంతోపాటు నిరంతరం కంటి పరీక్షలు చేయాలి.
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల కోసం సరిపడా సిబ్బందిని అందుబాటులో ఉంచాలి. ఇందుకు సంబంధించి వెంటనే నియామకాలు పూర్తి చేయాలి. (అక్టోబర్ 15లోగా పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు) సదుపాయాలను మెరుగు పరచాలి. అప్పుడే ప్రజలు ప్రభుత్వాస్పత్రుల సేవలను మెరుగ్గా వినియోగించుకుంటారు.
- ఆరోగ్య శ్రీ కింద అక్టోబర్ 2 నాటికి మొత్తం 3,118 వైద్య ప్రక్రియలకు చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలి.



వైద్య ఆరోగ్య శాఖ కార్యకలాపాలపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహిస్తున్న సీఎం వైఎస్ జగన్

'నాడు–నేడు'పై ప్రతివారం సమీక్ష

- రాష్ట్రంలో చేపట్టిన కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణాల పురోగతితో పాటు ప్రస్తుతం ఉన్న మెడికల్ కాలేజీల్లో నాడు–నేడు పనులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. ప్రతివారం సమీక్ష చేయడంతో పాటు నిర్దేశించుకున్న సమయంలోగా నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలి.
- సమావేశంలో మంత్రి విడదల రజని, ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ముఖ్య కార్యదర్శి (కోవిడ్ మేనేజ్‌మెంట్ అండ్ వ్యాక్సినేషన్) ముద్దాడ రవిచంద్ర, ఆర్థిక శాఖ కార్యదర్శి ఎస్ గుల్జార్, ప్రత్యేక కార్యదర్శి నవీన్ కుమార్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ జె.నివాస్, ఆరోగ్యశ్రీ సీఈవో హరీంద్రప్రసాద్, ఏపీవీవీపీ కమిషనర్ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీ మరింత పటిష్టం

'లబ్ధిదారులకు వర్చువల్ అకౌంట్లు క్రియేట్ చేశాం. వీటి ద్వారా ఆరోగ్యశ్రీ డబ్బు నేరుగా ఆస్పత్రులకు వెళ్తుంది. డబ్బులు డిడక్ట్ అవగానే పేషెంట్ సెల్‌ఫోన్‌కు ఎస్ఎంఎస్ వస్తుంది. రోగులు డిశ్చార్జి అయ్యేటప్పుడు వారికి అందిన వైద్య సేవలపై కన్సెంట్ లెటర్ కూడా తీసుకుంటున్నాం. లంచాలు లాంటివి ఉంటే ఫిర్యాదుకు ఏసీబీ 14400 నంబర్ పెట్టాం. పేషెంట్ డిశ్చార్జ్ అయి ఇంటికి వెళ్లిన తర్వాత కూడా ఏఎన్ఎం వారి ఇంటికి వెళ్లి ఫీడ్ బ్యాక్ తీసుకుంటారు. ఆస్పత్రిలో వైద్య సేవలు, ఆరోగ్య మిత్రల పని తీరుపై అభిప్రాయాలు తీసుకుంటారు. ఆ తర్వాత సెల్ఫీ తీసుకుని అప్‌లోడ్ చేస్తారు' అని అధికారులు సీఎంకు వివరించారు.

• తెలంగాణ

బ్యాటరీ పేలుడు వల్లే..

- సికింద్రాబాద్ అగ్నిప్రమాద ఘటనపై పోలీసుల ప్రాథమిక నిర్ధారణ
- ఎనిమిదికి చేరిన మృతుల సంఖ్య

సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్‌లోని రూబీ ఎలక్ట్రికల్ స్కూటర్స్‌లో జరిగిన అగ్ని ప్రమాదానికి ఈ–స్కూటర్ బ్యాటరీ పేలడమే కారణమని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. దట్టమైన పొగ ప్రభావంతోనే లాడ్జిలో బస చేసిన వాళ్లు చనిపోయినట్లు తేల్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో ఒకరు మంగళవారం మృతిచెందడంతో ఈ దుర్ఘటనలో కన్నుమూసిన వారిసంఖ్య ఎనిమిదికి చేరింది. చికిత్స పొందుతున్న వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. అగ్నిప్రమాదం జరిగిన హోటల్, విద్యుత్ ద్విచక్ర వాహనాల షోరూమ్ నిర్వహిస్తున్న రాజేందర్‌సింగ్ బగ్గా, సుమిత్‌సింగ్‌లతోపాటు మరికొందరిపై మార్కెట్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారిని మంగళవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

లాడ్జిలోకి వ్యాపించిన పొగలు

హైదరాబాద్‌లోని కార్ఖానా ప్రాంతానికి చెందిన రాజేంద్రసింగ్ బగ్గా, సుమిత్‌సింగ్ కొన్నేళ్లుగా సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ రోడ్డులో రూబీ ప్రైడ్ లగ్జరీ హోటల్ పేరుతో లాడ్జి నిర్వహిస్తున్నారు. రెండేళ్ల కిందట ఓ సంస్థకు చెందిన ఈ–స్కూటర్స్ డీలర్‌షిప్ తీసుకుని షోరూం, సర్వీసింగ్ సెంటర్లను లాడ్జి గ్రౌండ్‌ఫ్లోర్, సెల్లార్‌లో అక్రమంగా ఏర్పాటు చేశారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో రిసెప్షన్, ఈ–స్కూటర్స్ కార్యాలయం, మొదటి అంతస్తు నుంచి నాలుగో అంతస్తు వరకు మొత్తం 28 గదులు ఉన్నాయి. ఐదో అంతస్తులోని పెంట్‌హౌస్‌లో రెస్టారెంట్ నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి 9:17 గంటలకు సెల్లార్‌లోని ఈ–స్కూటర్స్ సర్వీసింగ్ పాయింట్‌లో చార్జింగ్ పెట్టిన ఈ–స్కూటర్ బ్యాటరీ పేలడంతో మంటలు అంటుకున్నాయి. పక్కనున్న వాహనాలకు, నిల్వ ఉంచిన టైర్లు, ప్లాస్టిక్, రబ్బర్ వస్తువులకు మంటలు అంటుకోవడంతో దట్టమైన పొగ, విషవాయువులు వెలువడ్డాయి. ఆ సమయంలో లాడ్జిలో 25 మంది అతిథులు, ఎనిమిదిమంది ఉద్యోగులు ఉన్నారు. భవనాన్ని సరైన వెంటిలేషన్ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించడం, ఐదో అంతస్తు నుంచి సెల్లార్ వరకు నిర్మించిన మెట్లమార్గం మీటరు కంటే తక్కువ వెడల్పుతో ఇరుగ్గా ఉండటంతో ప్రమాద సమయంలో అదే చిమ్నీ గొట్టంలాగా మారిపోయింది. సెల్లార్ నుంచి విషవాయువులు, నల్లటి పొగ దీనిద్వారానే లాడ్జి మొత్తం వ్యాపించాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో స్టెయిర్ కేస్‌కు, రిసెప్షన్‌కు మధ్య తలుపు మూసి ఉండటంతో పొగ బయటకు వచ్చే అవకాశం లేకపోయింది. పొగను గమనించిన సిబ్బంది బయటకు పరుగులు తీయగా మొదటి, రెండో అంతస్తుల్లో బసచేసిన వారిలో నలుగురు గదుల్లోను, ముగ్గురు మెట్ల మార్గంలోను ప్రాణాలు విడిచారు. మరో 10 మంది అస్వస్థతకు గురయ్యారు. మూడు, నాలుగో అంతస్తుల్లో బసచేసిన కొందరిని స్థానికులు, పోలీసులు, అగ్నిమాపకశాఖ వారు కాపాడారు. పెంట్‌హౌస్‌లో భోజనం చేస్తున్న నలుగురు పక్కభవనం టెర్రస్‌పైకి చేరుకుని ప్రాణాలు కాపాడుకున్నారు.

రూ.3 లక్షల చొప్పున పరిహారం

మృతుల కుటుంబాలకు సీఎం కేసీఆర్ రూ.3 లక్షల నష్టపరిహారం ప్రకటించారు.

కేంద్రం రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా

సాక్షి, న్యూఢిల్లీ: సికింద్రాబాద్ అగ్నిప్రమాదంపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయనిధి నుంచి రూ.2 లక్షల చొప్పున, గాయపడినవారికి రూ.50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని ప్రధాని కార్యాలయం ట్వీట్ చేసింది.

మృతులు వీరే..

1. అల్లాడి హరీష్ (33)	విజయవాడ
2. వీరేందర్‌కుమార్ దేవకార్ (50)	ఢిల్లీ
3. రాజీవ్‌మాలిక్	'
4. సందీప్‌మాలిక్	'
5. సీతారామన్ (48)	చెన్నై
6. బాలాజీ (58)	'
7. చందన్ జీథి (30)	ఒడిశా
8. మిథాలి మహాపాత్ర	(29)

ఏ పార్టీతోనూ సంబంధం లేదు

▶ మొదటి పేజీ తరువాయి

ఒక ప్రకటన విడుదల చేశారు. కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం ఉద్దేశపూర్వకంగా తమ సంస్థపై అసత్యాలతో కూడిన వార్తలను ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. జేపీవీఎల్ ఇసుక సబ్ కాంట్రాక్టులను అధికార పార్టీ నేతలకు జిల్లాల వారీగా ఇచ్చినట్లు ఎల్లో మీడియా రెండు రోజులుగా తప్పుడు కథనాలను ప్రచురిస్తోంది. ప్రభుత్వమే ఈ సబ్ కాంట్రాక్టులను ఇస్తున్నట్లు, ఇసుకలో భారీ దోపిడీ జరుగుతున్నట్లు అసత్య కథనాలను వెలువరిస్తోంది. ఈ నేపథ్యంలో దీనిపై జేపీవీఎల్ సంస్థ స్పందించింది. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎంఎస్‌టీసీ ద్వారా నిర్వహించిన టెండర్లలో తమ సంస్థ రాష్ట్రంలో ఇసుక ఆపరేషన్స్ నిర్వహణను దక్కించుకున్నట్లు పేర్కొంది. టెండర్లలో మిగిలిన సంస్థలతో పోటీ పడి తమ సాంకేతిక, ఆర్థిక సామర్థ్యాన్ని నిరూపించుకుని కాంట్రాక్టు పొందినట్లు వెల్లడించింది. టెండర్ నిబంధనల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన అన్ని నిబంధనలను పాటిస్తూ ఇసుక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలిపింది. తమ సంస్థకు విద్యుత్, కోల్ మైనింగ్ రంగాల్లో విస్తారమైన అనుభవం ఉందని, తాము చేపట్టిన ఏ ప్రాజెక్టునైనా సమర్థంగా నిర్వహిస్తామని పేర్కొంది.



ఇతరులు లావాదేవీలు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు..

రాష్ట్రంలో ఇసుక తవ్వకాలు, విక్రయాలను నిర్వహించేందుకు టెండర్ల ద్వారా దక్కించుకున్న జేపీవీఎల్ అనుమతించిన వ్యక్తులకు మాత్రమే అవకాశం ఉందని జిల్లాల ఎస్పీలు స్పష్టం చేశారు. ఇతరులు ఎవరైనా ఇసుక సబ్ కాంట్రాక్టర్ లేదా ఇతర పేర్లతో లావాదేవీలు జరిపితే చట్టపరంగా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సబ్ కాంట్రాక్టులు పొంది జిల్లాల వారీగా విక్రయాలను నిర్వహిస్తున్నట్లు ఎవరైనా ప్రచారం చేసుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జేపీవీఎల్ పోలీస్ శాఖను కోరినట్లు తెలిపారు.

సిక్కోలు, ఉమ్మడి విశాఖలో కుంభవృష్టి

- భీమునిపట్నంలో 17.9 సెం.మీ.. గారలో 15 సెం.మీ. వర్షపాతం
- నందిగాంలో పిడుగుపాటుకు రైతు బలి
- శ్రీకాకుళం నగర రోడ్లన్నీ జలమయం
- జాతీయ రహదారిపైకి వరద నీరు
- 13 మండలాల్లో విద్యాసంస్థలకు సెలవు
- లోటు నుంచి అధిక వర్షపాతానికి చేరుకున్న విశాఖ



పెదపాడు జాతీయరహదారిపై వరద నీటిలో కొట్టుకుపోతున్న కారును ఒడ్డుకు చేరుస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం/సాక్షి, విశాఖపట్నం: శ్రీకాకుళం జిల్లాలో మంగళవారం వేకువజాము నుంచి కుండపోతగా వర్షం కురిసింది. గార మండలంలో దాదాపు 15 సెం.మీ. వర్షం పడగా, శ్రీకాకుళంలో 7, ఆమదాలవలసలో 6, నరసన్నపేటలో 4 సెం.మీ. పైగా వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఒక్కరోజే 722 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. భారీ వర్షానికి శ్రీకాకుళం నగర రోడ్లన్నీ జలమయమయ్యాయి. సూర్యమహల్ వద్ద ముంపు అంచనా వేయలేకపోవడంతో ఓ కారు కల్వర్టులోకి దూసుకెళ్లిపోయింది. పెదపాడు చెరువు పొంగి ప్రవహించడంతో జాతీయ రహదారిపైకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. వాహనాలు మునిగిపోయేంత మేర నీరు ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జాతీయ రహదారిపై నీటిని కల్వర్టుల ద్వారా మళ్లించారు. ఇక నందిగాం మండలం కాపుతెంబూరుకు చెందిన రైతు కొల్లి వనజానాభం (40) పొలంలో నీటిని మళ్లిస్తుండగా పిడుగుపాటుకు గురై మృతిచెందాడు. భారీ వర్షాలతో 13 మండలాల్లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

ఉమ్మడి విశాఖలోనూ కుండపోత..

మరోవైపు.. ఉమ్మడి విశాఖ జిల్లాలోనూ కుంభవృష్టి కురిసింది. సోమవారం అర్ధరాత్రి దాటాక మొదలైన వర్షం మంగళవారం ఉదయం వరకు కొనసాగింది. విశాఖ నగర శివారుల్లో పల్లపు ప్రాంతాల్లోకి భారీగా నీరు చేరింది. భీమునిపట్నంలో అత్యధికంగా 17.9 సెం.మీల వర్షపాతం రికార్డయింది. గోపాలపట్నంలో 12.1, విశాఖ రూరల్‌లో 10.8, గాజువాక 8.2, అనకాపల్లి జిల్లా పరవాడలో 6.3, అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో 4.8, చింతపల్లిలో 4.6 సెం.మీల చొప్పున వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి వర్షం తగ్గుముఖం పట్టింది.

రుతుపవన ద్రోణితో భారీ వర్షాలు

ఇక రుతుపవన ద్రోణి చురుగ్గా ఉండడం భారీ వర్షాలకు దోహదపడిందని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు తెలిపారు. నైరుతి రుతుపవనాల సీజనులో ఇప్పటివరకు ఒక్క విశాఖ జిల్లా మాత్రమే లోటులో ఉంది. నాలుగు రోజుల క్రితం వరకు ఈ జిల్లా వర్షపాతం సాధారణం కంటే 20.9 శాతం లోటులో ఉండేది. కానీ, ప్రస్తుత వర్షాలతో 3.9 శాతం అధిక వర్షపాతానికి చేరుకుంది. అంటే మూడ్రోజుల వ్యవధిలో దాదాపు 24 శాతం వర్షపాతం పెరిగినట్లయింది.

పదం కలుపుతున్న పల్లె

సంక్షేమ సారథులకు గడపగడపనా ఘనస్వాగతం

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా సాగుతోంది. గ్రామాలకు వెళ్తున్న ప్రజాప్రతినిధులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. అన్ని జిల్లాల్లో మంగళవారం ఈ కార్యక్రమం వేడుకగా సాగింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. తమ సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌కు, నాయకులకు తమ ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని ప్రజలు దీవిస్తున్నారు.



కృష్ణా జిల్లా కంకిపాడు మండలం దావులూరులో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



వైఎస్సార్ జిల్లా ఖాజీపేట మండలం ఏటూరులో పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో లబ్ధిదారులకు పథకాల గురించి వివరిస్తున్న ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

అభిమాన అభిషేకం



వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలను అక్టోబర్ ఒకటో తేదీ నుంచి అమలు చేస్తామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంపై హర్షం వ్యక్తంచేస్తూ పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీలు, భవన నిర్మాణ కార్మికులు మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. చిలకలూరిపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి భాస్కర్ సెంటర్‌లో ఉన్న దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని పాల్గొని డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. –చిలకలూరిపేట

రైలుబండిలో ప్రసవం

- సికింద్రాబాద్ నుంచి విశాఖ వస్తుండగా మార్గమధ్యంలో గర్భిణికి పురిటి నొప్పులు
- అదే బోగీలో ప్రయాణిస్తున్న హౌస్‌సర్జన్
- మిగతా మహిళల సాయంతో పురుడుపోసిన డాక్టరమ్మ
- తల్లీబిడ్డ క్షేమం





బిడ్డతో సత్యవతి

సత్యవతిని పరీక్షిస్తున్న డాక్టర్ స్వాతిరెడ్డి

అనకాపల్లి టౌన్: సికింద్రాబాద్–విశాఖ దురంతో రైల్లో పండంటి ఆడ శిశువుకు ఓ తల్లి జన్మనిచ్చింది. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం పొన్నాంకు చెందిన పి.సత్యవతి.. భర్త సత్యనారాయణతో కలిసి బీ–6 ఏసీ బోగీలో ప్రయాణిస్తున్నారు. ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్న సత్యనారాయణ భార్యను డెలివరీ నిమిత్తం స్వగ్రామానికి తీసుకెళుతున్నారు. సోమవారం సాయంత్రం సికింద్రాబాద్ స్టేషన్‌లో రైలెక్కారు. మంగళవారం వేకువజామున రైలు రాజమండ్రి స్టేషన్ దాటుతుండగా సత్యవతికి పురిటి నొప్పులు మొదలయ్యాయి. సత్యనారాయణ టికెట్ కలెక్టర్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన అనకాపల్లిలో రైలు ఆపేందుకు చర్యలు చేపట్టారు. ఇంతలో నొప్పులు మరింత పెరిగాయి. దీంతో అదే బోగీలో ప్రయాణిస్తున్న హౌస్‌సర్జన్ స్వాతిరెడ్డి అదే బోగీలో ప్రయాణిస్తున్న మహిళల సాయంతో సుఖప్రసవం చేశారు. ఈలోగా రైలు అనకాపల్లి రైల్వేస్టేషన్ చేరుకుంది. 108లో స్థానిక ఆస్పత్రికి తరలించారు. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారు.



ఒక క్రూర మృగం కంటే ఒక దుష్టుడైన స్నేహితుడికి ఎక్కువ భయపడాలి. క్రూర మృగం కేవలం నీ శరీరాన్ని మాత్రమే గాయపరుస్తుంది; దుష్టుడైన స్నేహితుడు నీ హృదయాన్ని గాయపరుస్తాడు.

– గౌతమ బుద్ధుడు

సాక్షి

బుధవారం, సెప్టెంబర్, 14

కదిలిన తేనెతుట్టె!

చిన్నగా మొదలైన కొన్ని అంశాలే కాలగతిలో పెను పరిణామాలకు దారితీస్తాయి. ఇది చరిత్రలోని చిత్రమైన లక్షణం. వారణాసిలోని జ్ఞానవాపి మసీదు వ్యవహారానికి సంబంధించి అక్కడి జిల్లా న్యాయస్థానం సోమవారం ఇచ్చిన 26 పేజీల ఆదేశం సరిగ్గా అలాంటిదే. మసీదు ప్రాంగణంలోని హిందూ దేవతామూర్తులను పూజించేందుకు అనుమతించాలంటూ అయిదుగురు హిందూ మహిళలు వేసిన పిటిషన్ విచారణార్హమైనదే అని కోర్టు నిర్ణయించడం కీలక పరిణామం. 17వ శతాబ్దికి చెందిన ఈ మసీదులో పూజలకు అనుమతించడానికి ఇప్పుడున్న మూడు చట్టాల ప్రకారం కుదరదంటూ మసీదును నిర్వహిస్తున్న అంజుమన్ ఇంతెజామియా మస్జిద్ కమిటీ వాదించింది. ప్రార్థనా స్థలాల (ప్రత్యేక ఏర్పాట్లు) చట్టం – 1991, వక్ఫ్ చట్టం – 1995, యూపీ శ్రీకాశీ విశ్వనాథ్ ఆలయ చట్టం –1983... ఈ మూడింటినీ కమిటీ ప్రస్తావించింది. కానీ, జడ్జి విశ్వేశ ఆ వాదనను తోసిపుచ్చారు. ఈ 22న విచారణకు నిర్ణయించారు. జిల్లా కోర్ట్ ఆదేశంపై మస్జిద్ కమిటీ హైకోర్ట్ గుమ్మం తొక్కనుంది. వెరసి, సుదీర్ఘంగా సాగిన అయోధ్యలోని వివాదాస్పద బాబ్రీ మసీదు – రామజన్మభూమి వ్యవహారంలా ఇక ఇప్పుడు కాశీలో జ్ఞానవాపి కథ మొదలు కానుంది.

కొద్దినెలల విరామం తర్వాత జ్ఞానవాపి మసీదు వివాదంలో మొదలైన ఈ కొత్త అంకం అనేక పర్యవసానాలకు దారితీయడం ఖాయం. కొద్ది నెలల క్రితం మసీదు ప్రాంగణాన్ని సర్వే చేసి, వీడియో తీసినప్పుడు బయటపడ్డ శివలింగం తరహా నిర్మాణం గురించి కోర్టులో చర్చకు రానుంది. అయోధ్య, కాశీ, మథురల్లోని మసీదులు నిజానికి హిందువుల భూభాగాలేననే వాదన దీర్ఘకాలంగా ఉంది. చాలా ఏళ్ళుగా బీజేపీ, సంఘ్ పరివార్‌లు దాన్ని తమ రాజకీయ అజెండాగా మార్చుకున్నాయి. దీనిపై ఇటు వీధుల్లోనూ, అటు కోర్టుల్లోనూ పోరు సాగిస్తూనే ఉన్నాయి. రామజన్మభూమి ఉద్యమం తీవ్రంగా సాగుతున్న వేళ ఆ స్థాయి వివాదాలు ఇతర ప్రార్థనా స్థలాలపై తలెత్తకూడదనే ఉద్దేశంతో 1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టాన్ని అప్పటి కేంద్రప్రభుత్వం చేసింది. 1947 ఆగస్టు 15 నాటికి ఉన్న స్థితినే కొనసాగించాలనీ, ఏ వివాదాస్పద ప్రార్థనా స్థల స్వరూప స్వభావాలనూ మార్చరాదనీ సదరు చట్టం నిర్దేశిస్తోంది. తీరా 1992లో బాబ్రీ మసీదు కూల్చివేతతో ప్రార్థనాస్థల రాజకీయాలు పతాకస్థాయికి చేరాయి. మళ్ళీ ఇప్పుడు జ్ఞాన వాపిపై కోర్టు ఆదేశంతో ఒకప్పటి బాబ్రీ మసీదు వివాదంలా సమాజంలోని రెండు వర్గాల మధ్య సామరస్యం దెబ్బతిని, సుస్థిరత దెబ్బతినే ప్రమాదం ఉంది. 1991 నాటి చట్టం సైతం నిష్ప్రయోజనం కావచ్చని ముస్లిమ్ వర్గం ఆందోళన.

అయితే, 1947కూ, 1993కూ మధ్య జ్ఞానవాపి ప్రాంగణంలో హిందువుల ప్రార్థనలను అనుమతించారు. 1993 తర్వాతా ఇప్పటి వరకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఏటా ఒకసారి అక్కడ దేవతామూర్తుల ప్రార్థనకు వీలు కల్పిస్తున్నారు. హిందూ మహిళల పిటిషన్‌ను అనుమతించిన జిల్లా కోర్ట్ ఆ సంగతులే గుర్తు చేసింది. ప్రార్థనాస్థల ధార్మిక స్వరూప స్వభావాలను మార్చే ప్రయత్నమేదీ ఇందులో లేదనీ, అక్కడ పూజలు చేసుకొనే హక్కు మాత్రమే అడుగుతున్నారనీ వ్యాఖ్యానించింది. కానీ, కథ అంతటితో ఆగుతుందా అన్నది ప్రశ్న. నిజానికి, జ్ఞానవాపి ప్రాంగణంపై హక్కులకు సంబంధించి హైకోర్ట్‌లో ఇప్పటికే అనేక కేసులు విచారణలో ఉన్నాయి. ప్రాంగణంలో భారత సర్వేక్షణ సంస్థ (ఏఎస్ఐ)తో సర్వేకు అనుమతిస్తూ కింది కోర్టు ఇచ్చిన ఆదేశం పైనా హైకోర్ట్ విచారిస్తోంది. ఇలా జ్ఞానవాపిపై ఒక వర్గం ఒకే రకమైన పలు కేసులు దాఖలు చేయడం ఒక వ్యూహం ప్రకారం జరుగుతోందని రెండో వర్గం అనుమానం.

పూజల కోసం భక్తులు వేసిన పిటిషన్‌ను ముందుగా జిల్లా కోర్టు వినాలని ఆ మధ్య సుప్రీం కోర్టే చెప్పింది. వారణాసి కోర్ట్ తాజా నిర్ణయంతో వివాదం పైకోర్టులకు పాకుతుంది. నిజానికి, దశాబ్దాల తరబడి సాగిన రామజన్మభూమి వివాదంపై 2019లో అత్యున్నత న్యాయస్థానం చరిత్రాత్మక తీర్పునిచ్చింది. బాబ్రీ మసీదు ఒకప్పుడున్న స్థలంలో రామాలయ నిర్మాణానికి అడ్డంకులు తొలగిస్తూనే, 1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టాన్ని భారత రాజ్యాంగ లౌకికవాద లక్షణాలను కాపాడేందుకు తీర్చిదిద్దిన చట్టపరమైన పరికరంగా అభివర్ణించింది. తీరా తాజా నిర్ణయంతో వారణాసి కోర్ట్ ఆ మాటలను ప్రశ్నార్థకం చేసి, వివాదాల తేనెతుట్టెను కదిలించింది. పైకి కోర్టు కేసులుగా కనిపిస్తున్నా, వీటిలో రాజకీయాలూ పుష్కలం. బాబ్రీ మసీదు వివాదంతో ఇప్పటికే దేశంలో ఒక వర్గాన్ని బయటి వ్యక్తులుగా చూసే ధోరణి ప్రబలింది. జాతీయవాదం, హైందవ ఆత్మగౌరవం లాంటి పదబంధాలకు ప్రాచుర్యం పెరిగింది. మరోపక్క మథుర, ఆగ్రాల్లోనూ ఇలాంటి కేసులే కోర్టుల్లో ఉన్నాయి.

అసలు 'ప్రార్థనాస్థలాల చట్టం–1991' రాజ్యాంగబద్ధత పైనా సుప్రీమ్‌లో కేసు పెండింగ్‌లో ఉంది. ఆ అంశంపై సుప్రీమ్ తీర్పు కోసం నిరీక్షించకుండా, జిల్లా కోర్ట్ అత్యుత్సాహం చూపింది. ఈ పరిస్థితుల్లో ఈ వివాదాలన్నిటికీ కీలకం కానున్న 1991 నాటి చట్టానికి సంబంధించి అత్యున్నత న్యాయస్థానం ఎంత త్వరగా తన తీర్పునిస్తే అంత మంచిది. కింది కోర్టులకు అది మార్గదర్శకమవుతుంది. సమస్యలు మరింత జటిలం కాకుండా అడ్డుకుంటుంది. ఎందుకంటే, ధార్మిక విశ్వాసాలు నిప్పు లాంటివి. వాటితో చెలగాటమాడితే చేతులు కాలక తప్పదు. ఏమరుపాటుగా ఉంటే సమాజాన్నీ, విభిన్న వర్గాల సామరస్యాన్నీ ఆ అగ్ని దహించకా తప్పదు. న్యాయస్థానాల మొదలు ప్రభుత్వాల దాకా అందరూ అప్రమత్తంగా ఉండాల్సింది అందుకే!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.చవితి ప.12.19 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** అశ్వని ఉ.9.51 వరకు, తదుపరి భరణి **వర్జ్యం:** రా.7.45 నుండి 9.26 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.33 నుండి 12.21 వరకు, **అమృతఘడియలు:** తె.5.44 నుండి 7.22 వరకు (తెల్లవారితే గురువారం).

సూర్యోదయం : 5.50
సూర్యాస్తమయం: 6.03
రాహుకాలం : ప. 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

ఓటమి భయంతో రెండు నాల్కలు

విశ్లేషణ



కొమ్మినేని శ్రీనివాసరావు

తెలుగుదేశం అధినేత చంద్రబాబు మాటలను వింటే, ఆయన ఏం మాట్లాడుతున్నారో ఆయనకు తెలియడం లేదని ఎవరికైనా అనుమానం కలుగుతుంది. జగన్ ప్రభుత్వంపై పోరాడమంటారు, కానీ ఎందుకు పోరాడాలో చెప్పరు. సంక్షేమ పథకాల వల్ల ఆంధ్రప్రదేశ్ నాశనం అయిందంటారు. మళ్లీ తాము అధికారంలోకి వస్తే అంతకంటే ఎక్కువ అమలు చేస్తానని చెబుతారు. రాష్ట్ర పునర్నిర్మాణం మీద దృష్టి పెట్టామని చెబుతూనే, వస్తున్న పరిశ్రమలను అడ్డుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ అన్ని ఎన్నికల్లోనూ వరుస పరాజయాలు, పరాభవాల తర్వాత ఆయన చేతులెత్తేసినట్టు స్పష్టంగా తెలుస్తోంది. కానీ దాన్ని బహిరంగంగా ఒప్పుకోలేరు. అందుకే దేన్ని విమర్శిస్తున్నారో కూడా ఆయనకు స్పష్టత లేకుండా పోయింది.

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడి ప్రకటనలు చిత్ర విచిత్రంగా ఉంటాయి. కొద్ది రోజుల క్రితం ఆయన చేసిన ఒక ప్రసంగం చూస్తే... ఇదేమిటి? చంద్రబాబు నాయుడు ఇలా మాట్లాడుతున్నారు? ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ మళ్లీ గెలిచే అవకాశం లేదా అని ఆ పార్టీ కార్యకర్తలకే అనుమానం వస్తుంది. పైకి గంభీరంగా మాట్లాడుతున్నా, లోపల చంద్రబాబు నాయుడులోని గుబులు స్పష్టంగా కనిపిస్తూనే ఉంటుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వంపై పోరాడాలని ఆయన అంటారు. అంతవరకు తప్పు లేదు. కానీ ఎందుకు పోరాడాలి అన్నదానిపై ఆయనకే క్లారిటీ లేదు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విమర్శిస్తారు. ఆంధ్రప్రదేశ్ నాశనం అయిపోయిందని అంటారు. కానీ వైఎస్ జగన్ కంటే ఎక్కువ సంక్షేమ పథకాలు తాను అమలు చేస్తాననీ, వాటికి రెట్టింపు ఇస్తాననీ ఆయన చెబుతారు. దీనిని ఎవరైనా నమ్ముతారా?

అంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'అమ్మ ఒడి' పథకం కింద ఏడాదికి తల్లులకు పదిహేను వేల రూపాయలు ఇస్తున్నారు. మరి తాను ముప్పై వేలు ఇస్తానని చంద్రబాబు చెబుతారా? అంటే ఆ మాట చెప్పరు. మరి ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీలంక అయిపోయిందని ఆరోపించారు కదా? మరి చంద్రబాబు నాయుడు ఎలా రెట్టింపు పథకాలు ఇస్తారన్న ఆలోచన కాస్త విజ్ఞత ఉన్నవారికి ఎవరికైనా వస్తుంది. అలాంటిది తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు రాదా? అంటే దాని అర్థం అటు జగన్ ప్రభుత్వ పథకాలను కాదనలేకా, ఇటు అవుననలేకా ఆయన సతమతమవుతూ, తన సహజ లక్షణం ప్రకారం డబుల్ టాక్ చేస్తున్నారన్నమాట!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నాశనం అని చెప్పడం ప్రతిపక్షాలకు ఒక ఫ్యాషన్ అయింది. ఏ విధంగా నాశనం అయింది? జగన్ ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేయడం వల్లా? మరేదైనా కారణమా? అన్నదానిపై ఒక్క విపక్ష నేత కూడా ఇంతవరకూ మాట్లాడలేక పోయారు. కేవలం ద్వేషంతో ఇలాంటివి ప్రచారం చేస్తున్నారని అర్థం చేసుకోవచ్చు.

పోలీసులు లేకుండా వస్తే వైసీపీనో, టీడీపీనో తేల్చుకుందామని చంద్రబాబు నాయుడు అన్నారు. ఏమిటి దీని అర్థం? నలభై ఐదేళ్ల రాజకీయ అనుభవం కలిగిన వృద్ధనేత ఈ మాటలు అనడం సరైనదేనా? ఇది సాధ్యమేనా? ఆయన తన చుట్టూ ఉన్న ఎన్ఎస్‌జీ సెక్యూరిటీ వంద మందిని పక్కనబెట్టి ఎక్కడైనా తిరుగుతున్నారా? తాను సెక్యూరిటీ లేకుండా తిరుగుతున్నాననీ, రోడ్డు మీద తేల్చుకుందామనీ అనగలరా? అలా చెప్పరు. కానీ టీడీపీ కార్యకర్తలు మాత్రం రోడ్ల మీదకు వెళ్లి తన్నుకు చావాలన్నమాట. తమ పోరాటాల ద్వారా పోలీసులతో కార్యకర్తలు కేసులు పెట్టించుకోవాలట.



అవసరమైతే కోట్లు ఖర్చు పెట్టడానికి ఆయన వెనుకాడరట. ఇది ఏమైనా పద్ధతేనా? కోర్టులలోనే కేసులు గెలవడానికి కోట్లు ఖర్చు పెట్టగలిగిన చంద్రబాబు నాయుడు ఎన్నికలలో మరెన్ని కోట్లు వ్యయం చేస్తారన్న ప్రశ్న వస్తే ఆయన సమాధానం ఇస్తారా? చంద్రబాబు చివరికి కేసులు, కోర్టుల మీద ఆధారపడి రాజకీయాలు చేస్తున్నారన్నమాట! చంద్రబాబు నాయుడు మాటలు నమ్మి నిజంగానే ఎవరైనా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు రెచ్చిపోయి పిచ్చిపిచ్చి చేష్టలకు పాల్పడితే నష్టపోయేది వారే. ఎందుకంటే చంద్రబాబు ఎప్పుడూ సురక్షితమైన కోట వంటి ఇళ్లలో, వందల మంది భద్రత మధ్య నివసిస్తుంటారు. ఆయనకేమీ కాదు. కార్యకర్తలు ప్రజలలోకి వెళ్లి పనిచేయాలని చెప్పవచ్చు. కానీ పరోక్షంగా గొడవలు చేసి కేసులు పెట్టించుకోవాలని ఆయన చెబుతుంటే తెలివైన కార్యకర్త ఎవరైనా అందుకు సిద్ధపడతారా?

ఎన్నికలు త్వరగా వస్తే పీడ పోతుందట. అంటే గత ఎన్నికలలో తెలుగుదేశం పార్టీని ఓడించి ప్రజలు పీడ వదిలించుకున్నారని చంద్రబాబు నాయుడు అంగీకరిస్తారా? తెలుగుదేశం పార్టీని చూస్తే జగన్‌కు వెన్నులో వణుకు వస్తోందట. ఇలాంటి మాటలు ఎవరికి వర్తిస్తాయి? అన్ని ఎన్నికలలోనూ పరాజయం చెందినవారికీ, పరాభవం పొందినవారికి కదా భయం కలగలవలసింది? చంద్రబాబు తాను భయపడుతున్న విషయాన్ని బహిర్గతం కాకుండా ఉండడానికి ఇలాంటి ప్రయత్నాలు చేస్తుంటారు. కుప్పంలోనే స్థానిక ఎన్నికలన్నిటిలో ఘోర పరాజయం చవిచూసిన చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌ను చూసి భయపడుతుండడం వల్లే ఈ వ్యాఖ్యలు చేస్తున్నట్లు అర్థంకావడం లేదా?

మరో సందర్భంలో తనకు తెలియకుండానే చంద్రబాబు ఒక వాస్తవం ఒప్పుకున్నారు. ఇంతవరకూ జరిగిన రాజకీయం ఒక ఎత్తు... ఇకపై మరో ఎత్తు అని అన్నారు. చంద్రబాబు ఇది అనుభవపూర్వకంగానే చెబుతున్నారు. తన రాజకీయ జీవితంలో ఇంతటి చేదు ఫలితాలను ఆయన ఎన్నడూ చూడలేదు. అందుకే దుర్మార్గుడిని ఎదుర్కొనే శక్తి మనకు ఉంటేనే నిలబడగలుగుతాం అనీ, యోధుల్లా పోరాడుతున్న కార్యకర్తలను నాయకులు కడుపులో పెట్టుకుని కాపాడాలనీ ఆయన కోరుతున్నారు. కార్యకర్తలు యుద్ధానికి సన్నద్ధం కావాలట. ఎవరిపై యుద్ధం చేస్తారు? అన్ని వర్గాల ప్రజల కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న జగన్ ఏ రకంగా దుర్మార్గుడు అవుతారు? చెప్పిన హామీలను వేటినీ అమలు చేయని చంద్రబాబు కదా దుర్మార్గుడు అని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు సందేహం రాదా?

రాష్ట్రం పునర్నిర్మాణంపైనే దృష్టి నిలిపామనీ, పొత్తులపై తానెప్పుడూ మాట్లాడలేదనీ చంద్రబాబు అంటున్నారు. పొత్తులు కూడా అవసరాన్ని బట్టి సమయానుకూలంగా నిర్ణయం చేద్దామని ఆయన ఏ మాత్రం సిగ్గుపడకుండా చెప్పారు. రాష్ట్ర పునర్నిర్మాణం అంటే ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్న పరిశ్రమలు రాకుండా అడ్డుకోవడమా? ఆంధ్రప్రదేశ్‌కు ఆదాయ వనరులు లేకుండా కేవలం వంద కోట్లే మిగిల్చి వెళ్లడమా? వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి అప్పులు ఇవ్వవద్దని లేఖలు రాయడమా?

రాజకీయ పార్టీల మధ్య పొత్తులు ఉండవచ్చు. కానీ దానికి ఒక ప్రాతిపదిక ఉండాలి. ఈ విషయంలో చంద్రబాబు మాట మార్చినంతగా దేశంలో ఇంకెవరూ మార్చలేరేమో. భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ పార్టీలను ఆయన ఎన్నిసార్లు దూషించారు? అయినా మళ్లీ వాటితో పొత్తు పెట్టుకున్నారు. జనసేన పార్టీతో తాము వన్ సైడ్ లవ్ చేస్తున్నామని ఎందుకు బాధపడిపోయారు? ఇప్పుడు సిద్ధాంతాలు, విధానాలతో సంబంధం లేకుండా అవసరాన్ని బట్టి, సమయానుకూలంగా పొత్తులు పెట్టుకుందామని చెప్పగలిగారంటే అది ఆయనకే చెల్లింది. ఇంత చెప్పినా తెలుగుదేశం పార్టీ నాయకులలో అంత విశ్వాసం రావడం లేదని ఆయన మాటలే చెబుతున్నాయి. పార్టీ నేతలు బద్ధకం వీడాలనీ, ప్రజలలోకి వెళ్లాలనీ, పని చేయాలనీ పదే పదే కోరారు. ఇంతవరకు తప్పులేదు. కాకపోతే తాను మళ్లీ క్షేత్రస్థాయిలో గెలిచిన తర్వాతే అసెంబ్లీలోకి వస్తానని చెప్పాననీ, ఆ విషయాన్ని గుర్తుంచుకోవాలనీ చంద్రబాబు చెబుతున్నారు. దీని అర్థం ఏమిటి? తెలుగుదేశం వచ్చే ఎన్నికలలో కూడా అధికారం సాధించలేకపోతే, తాను అసెంబ్లీకి గెలిచినా వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆయన దయనీయంగా పార్టీ కార్యకర్తలకు వివరిస్తున్నారా? మళ్లీ గెలవలేమేమో అన్న భయం, సందేహాల మధ్య చంద్రబాబు నాయుడు ఇలా మాట్లాడుతున్న సంగతి మామూలు వ్యక్తులకు కూడా అర్థం అవుతుంది. అలాంటిది చంద్రబాబును దగ్గరగా చూస్తున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అర్థం కాదా?

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఇది నిజం



ఆవిరితో నడిచే యంత్రాలను మనం ఇప్పుడు చూస్తున్నట్టుగానే, గ్యాసోలిన్ (పెట్రోలు) కార్లను కూడా అలాగే విచిత్రంగా చూసే రోజులు ఎంతోదూరంలో లేవు.

– ఎలాన్ మస్క్, పారిశ్రామికవేత్త

తెలిసీ చేసినందుకు...



కోవిడ్–19 ఉన్నప్పటికీ ఇతర ప్రయాణీకులను ప్రమాదంలోకి నెడుతూ లండన్ నుంచి స్కాట్లాండ్‌కు రైల్లో ప్రయాణించానని ఒప్పుకున్న బ్రిటన్ ఎంపీకి శిక్ష పడింది. మార్గరెట్ ఫెర్రియర్‌కు 270 గంటల సామాజిక సేవ చేయాలని శిక్ష విధించారు. ఇలాంటిది ఇండియాలో ఎప్పటికీ జరగదు.

– ప్రసేన్‌జిత్ దత్తా, వ్యాపారాంశాల వ్యాఖ్యాత

ఇబ్బందిగా ఉందా?



రాహుల్ గాంధీ 'భారత్ జోడో యాత్ర' తమను చికాకు పెడుతున్నట్టుగా ఎందుకు భారతీయ జనతా పార్టీ ప్రతినిధులు, ప్రధాని నరేంద్ర మోదీ భక్తులు ప్రవర్తిస్తున్నారు? ఇది నిజం కాకపోతే – టీవీ ఛాట్ షోలు, సామాజిక మాధ్యమాల్లో ఇతర అంశాలను గురించి కూడా వాళ్లు మాట్లాడటం మొదలుపెట్టాలి.

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

ముందది మనదేగా!



వాస్తవాధీన రేఖ వెంబడి ఇండియా, చైనా ఇరుపక్షాలూ తమ భూభాగాల్లోకి వైదొలగాయని మోదీ ప్రభుత్వాన్ని ఉటంకిస్తూ ఇండియా మీడియా ఇస్తున్న కథనాలను చూసి చైనీయులు నవ్వుతున్నారు. సత్యం ఏమిటంటే, ఇండియా భూభాగం నుంచి చైనా వైదొలగింది; ఇండియా భూభాగం నుంచి ఇండియా వైదొలగింది. ఆ మేరకు చైనా 'నాదేమిటో అది నాది, నీదేమిటో కూడా నాది' అని ప్రకటించుకుంది.

– సుబ్రమణియన్ స్వామి, కేంద్ర మాజీ మంత్రి

ఇప్పటికైనా తప్పాయి



కోవిడ్ నిబంధనలను సవరించడంలో భాగంగా తప్పనిసరి మాస్కులు, తప్పనిసరి టీకాలను న్యూజిలాండ్ ప్రభుత్వం పరిహరించిందని వార్త. 'జీరో కోవిడ్ పిచ్చితనం' పేరిట చేసినదంతా పూర్తిగా తప్పు అని ఎంత గొప్పగా ఒప్పుకోవడం ఇది!

– ఎలీ డేవిడ్, పరిశోధకుడు

ఊహలు మాత్రమే



ఎలక్ట్రిక్ కార్లు, పవన విద్యుత్తుతో నడిచే టర్బయిన్లు, సోలార్ ప్యానెళ్లు... ఇవన్నీ కూడా వాతావరణ మార్పులో భాగంగా వచ్చే అతి ఊహలు. ఇవి వాస్తవంలో పనిచేయవు. శిలాజ ఇంధనాలు, కంబషన్ ఇంజిన్లకు ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాలేవు.

– పీటర్ ఇమాన్యుయల్‌సేన్, జర్నలిస్ట్

అతి విశ్వాసం



భర్తలు కూడా బాగా తయారై భార్యల కళ్లకు అందంగా కనబడాలని ఎందుకు కోరుకోరు? తమ రెండు జీన్సులు, ఐదు టీషర్టుల వార్డ్ రోబ్‌తోనే తమాయించుకోలేని, జీవితకాలం నిలిచే బంధంగా దాన్ని నిలపగలం అని వాళ్లు అనుకుంటారు.

– అంజలి ఏకే, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

ఇన్‌బాక్స్

సమైక్యతకు దోహదకారి

భారతదేశంలో అత్యధికంగా మాట్లాడే భాష, అర్థం చేసుకునే భాష హిందీ. దేశంలోని అన్ని రాష్ట్రాలను కలిపే సమర్థత కలిగిన భాషా ఇదే. స్వాతంత్ర్యోద్యమ కాలం కంటే ముందు నుండే దేశ ప్రజలను ఐక్యతా భావంతో నింపిన భాష హిందీ. గొప్ప సాహిత్యం కలిగినటువంటి భాష. ప్రేమ్‌చంద్, హజారీ ప్రసాద్ ద్వివేది, కాకా కాలేల్కర్, సేఠ్ గోవింద్ దాస్, బియోహార్ రాజేంద్ర సింహా, మాఖన్‌లాల్ చతుర్వేది, మహాదేవి వర్మ, సుమిత్రానందన్ పంథ్, సుభద్ర కుమారి చౌహాన్ లాంటి ఎందరో గొప్ప సాహితీకారులు, కవులను కలిగినటువంటి భాష హిందీ. అలాంటి హిందీని భారత అధికారిక భాషగా గుర్తించడంలో బియోహార్ రాజేంద్ర సింహా కృషి ఎనలేనిది. వారి కృషి ఫలితమే 1949 సెప్టెంబర్ 14న హిందీని అధికారిక భాషగా ప్రకటించడం జరిగింది. అంతేకాదు సెప్టెంబర్ 14 బియోహార్ రాజేంద్ర సింహా పుట్టినరోజు కావడం కూడా మరో విశేషం.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 343(1) ప్రకారం దేశంలోని గుర్తించబడ్డ 22 భాషల్లో హిందీని అధికారిక భాషగా గౌరవించిన ఈ రోజున, హిందీ భాష కోసం విశేషంగా కృషి చేసిన వ్యక్తులకు లేదా సంస్థలకు 'రాజ్ భాషా కీర్తి పురస్కార్' లేదా 'రాజ్ భాషా గౌరవ పురస్కార్' లాంటి అవార్డులను అందజేస్తున్నారు. అంతేకాదు పాఠశాల, కళాశాల స్థాయిలో వివిధ కార్యక్రమాలను నిర్వహించి ఘనంగా 'హిందీ దివస్' వేడుకలను జాతీయ దినోత్సవంగా జరుపుకొంటున్నాం.

ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే భాషల జాబితాలో హిందీ భాష రెండో స్థానం దక్కించుకుంది. హిందీ భాష వ్యాకరణం ప్రత్యేకంగా ఉంటుంది. భాష శైలి బాగుంటుంది. ప్రపంచవ్యాప్తంగా 150 విశ్వ విద్యాలయాల్లో హిందీని బోధిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హిందీని పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయ స్థాయిలో కచ్చితంగా ఒక సబ్జెక్ట్‌గా ఉంచి, భాషాభివృద్ధికి కృషి చేయాలి. అందరికీ హిందీ దినోత్సవ శుభాకాంక్షలు.

– డా॥ కమలేకర్ నాగేశ్వర్ రావు, 'హిందీ సేవీ' అవార్డు గ్రహీత
(నేడు హిందీ దినోత్సవం)

నేతన్నలపై భారాన్ని తొలగించాలి

సందర్భం



డా॥ శ్రీరాములు గోసికొండ

వస్త్ర రంగానికి సంబంధించి భారతదేశం ఆరవ అతిపెద్ద ఎగుమతిదారు. 2020–21లో భారతదేశ ఎగుమతుల్లో, వస్త్ర పరిశ్రమ వాటా 11 శాతం. మొత్తంమీద ప్రపంచ టెక్స్‌టైల్ విపణిలో మన దేశ వాటా 4 శాతం. చేనేత రంగంపై సుమారు 35 లక్షల మంది ఆధారపడి ఉన్నారు. అయితే కనీస ఆదాయం లేక అప్పులపాలు అవుతున్న నేతన్నలు అనేక చోట్ల ఆత్మహత్యలకు పాల్పడడం కలవరపరుస్తున్నది.

నేత కార్మికులను ఆదుకునేందుకు కేంద్రం కొన్ని చర్యలు తీసుకుంది. 2006లో కేంద్ర ప్రభుత్వం చేనేత వస్త్రాలను పాపులర్ చేయడానికీ, వినియోగదారులకు మగ్గంపై చేతులతో నేసిన వస్త్రం అని గ్యారంటీ ఇవ్వడానికీ 'హ్యాండ్ లూమ్ మార్క్' స్కీమ్ ప్రారంభించింది. ప్రతీ ఏటా 'సంత్ కబీర్' అనే జాతీయ అవార్డును హ్యాండ్ లూమ్‌లో ప్రతిభ కనబరిచిన నేత కార్మికులకు, ఆకర్షించే సరికొత్త డిజైన్ రూపకల్పన చేసిన వారికి, చేనేత వస్త్రాల మార్కెటింగ్‌కు నూతన మార్గాలు అన్వేషించిన వారికి అందిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో మాత్రమే తయారయ్యే నేత వస్త్రాలకు వాటి నకళ్ళు(కాపీ) వేరే ప్రాంతాల్లో తయారు చేయ కుండా జియోగ్రాఫికల్ ఇండికేషన్ (జీఐ)ను అమలు చేస్తున్నది. ఆసక్తి ఉన్న నేత కార్మికులు/ చేనేత సొసైటీ వారు, దీనికి ప్రత్యేకంగా అప్లై చేసుకోవడానికి అయ్యే ఖర్చుల కోసం లక్షన్నర రూపాయలను అందిస్తున్నది. నేత కార్మికుల పిల్లలు ఎవరైనా టెక్స్‌టైల్ ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యా సంస్థల్లో డిప్లొమా/డిగ్రీ/పీజీ చేసినట్లయితే, వారికి సంవత్సరానికి రెండు లక్షల స్కాలర్‌షిప్ శాంక్షన్ చేస్తోంది. కేంద్రం ప్రభుత్వం 'ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన', 'ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన' అనే పథకాలను అమలుచేస్తోంది. అలాగే 'ముద్ర' పథకం కింద నేతన్నలు కూడా ప్రయోజనం పొందవచ్చు.



2019–20 లో చేపట్టిన 4వ ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ సెన్సెస్ ప్రకారం, దేశంలో 26 లక్షల పైచిలుకు చేనేత కార్మికులు, మరో 8 లక్షల పైచిలుకు కార్మికులు చేనేత అనుబంధ రంగాల్లో పని చేస్తున్నారు. ఇందులో అస్సాం రాష్ట్రం 10 లక్షల నేత కార్మికులతో మొదటి స్థానంలో ఉండగా, వెస్ట్ బెంగాల్ (3.4 లక్షలు), మణిపూర్ (2.1 లక్షలు), తమిళనాడు (1.7 లక్షలు) రాష్ట్రాలు ఆ తరువాతి స్థానాల్లో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాలైన ఏపీలో 1.7 లక్షలు, టీఎస్‌లో 47 వేల నేత కార్మికులు ఉన్నారు. సుమారు 66 శాతం నేత కార్మికుల నెలసరి ఆదాయం రూ. 5 వేల కంటే తక్కువగానే ఉంది. సుమారు 10 శాతం కుటుంబాలు కడు పేదరికంలో (అంత్యోదయ రేషన్ కార్డ్), 37 శాతం కుటుంబాలు దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్ రేషన్ కార్డ్), 34 శాతం కుటుంబాలు దారిద్ర్య రేఖకు ఎగువన ఉండగా... 18 శాతం కుటుంబాలు ఏ రకమైన రేషన్ కార్డ్ లేకుండా ఉన్నాయి. కాయకల్ప చికిత్స చేసి చేనేతరంగాన్ని ఆదుకోవాల్సిన కేంద్రం, చేనేత వస్త్రాలపై 5 శాతం జీఎస్టీ వేయడంతో మూలిగే నక్క మీద తాటికాయ పడినట్లయింది. రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి, చేనేతపై విధించిన జీఎస్టీని రద్దు చేయించాలి. అప్పుడే రెండు రాష్ట్రాల్లో ఉత్పత్తి అయ్యే చేనేత వస్త్రాలు సామాన్యులకు కూడా అందుబాటులోకి వచ్చి, నేతకార్మికుల ఉపాధికి భరోసా ఉంటుంది.

వ్యాసకర్త అసిస్టెంట్ ప్రొఫెసర్,
నర్సీ మోంజీ డీమ్డ్ యూనివర్సిటీ, హైదరాబాద్

అందరి సంక్షేమం కోసం...

అభిప్రాయం



సంగిరెడ్డి హనుమంత రెడ్డి

ప్రపంచంలో రెండే వర్గాలు. ఒకటి ఒళ్ళు దాచుకోకుండా కూటి కోసం పనిచేసే వర్గం. దినకూలీలు, వేతనజీవులు ఇందులో ప్రధానం. రెండోది వీరి శ్రమశక్తిని దోచుకొని, దాచుకునే పనిచేయని పరాన్నభుక్కు వర్గం. స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలు ఇందులో భాగాలు.

పనివాళ్ళలో రెండు రకాలు: తక్కువ మేధతో ఎక్కువ శారీరక పనులు చేసే కార్మికులు. తక్కువ శారీరక శ్రమతో ఎక్కువ మేధతో పనిచేసే మేధో శ్రామికులు. మనం కులమతాల ప్రాతిపదికన ప్రజలను, సామాజిక వర్గాలుగా పొరపాటుగా వర్గీకరిస్తాం. శ్రమవిభజనతో ఏర్పడ్డ వృత్తులను అవమానిస్తాం. శ్రామికజన ప్రయోజన ప్రభుత్వ పథకాలను విమర్శిస్తాం.

ప్రాణికోటిలో అన్నిటికీ జీవావసరాలు ఒకే విధంగా ఉంటాయి. శరీర పోషణకు, పెరుగుదలకు ఆకలిదప్పులు, స్వజాతి పునరుత్పత్తికి లైంగిక వాంఛలు, శృంగార ప్రక్రియలు మనుషులతో సహా ప్రతి జీవికీ ఉంటాయి. ఈ అవసరాలు తీరితే చాలు. కానీ మెదడు అభివృద్ధి చెందిన మనిషి ఇతర ప్రాణులతో వేరుపడ్డాడు. వ్యక్తిగత అభిరుచులు, విశ్రాంతి, వినోదం ఏర్పరచుకున్నాడు. నాగరికుడయ్యాడు. నూతన ఆవిష్కరణలు చేస్తున్నాడు. పరికరాలను, వస్తువులను, యంత్రాలను సృష్టిస్తున్నాడు. ఉత్పత్తిని అనేక రెట్లు పెంచుతున్నాడు. అయితే ఉత్పత్తిని పెంచడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న శ్రమజీవులకు లాభాల్లో సరైన వాటా లభించడం లేదు. వారి శ్రమశక్తిని పెట్టుబడి దారీ పరాన్నభుక్కులే ఎక్కువగా అనుభవిస్తున్నారు. పనిచేసినవారికి మాత్రం కనీస సౌకర్యాలు కూడా అమరడం లేదు. అటువంటివారు పేదరికంలో మగ్గిపోతున్నారు.

అటువంటి పేదవారిని ఆదుకోవడం కోసమే నిజమైన పాలకుడు పాటుపడతాడు. రానున్న ఎన్నికలలో గెలుపు కోసం కాక భావితరాల బాగు కోసం పనిచేస్తాడు మనసున్న రాజకీయ నాయకుడు. కుల, మత, వర్గ, ప్రాంత, లింగ వివక్షలు పాటించడు. ప్రజలందరినీ సమానంగా పరిగణిస్తాడు. పథకాల ద్వారా కార్పొరేట్లకు ప్రయోజనం కల్పించడు. సామాజిక వర్గం పేరుతో ప్రజలను మోసగించడు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అణగదొక్కబడిన, వెనక్కునెట్టబడ్డ తరగతుల, వర్గాల ఉన్నతికి కృషిచేస్తాడు. అంతిమంగా పాలకులు, ప్రజలు కులమతాల ప్రసక్తి లేకుండా కులమత రహిత సమాజ స్థాపనకు తోడ్పడాలి.

వ్యాసకర్త ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి

క్లుప్తంగా

అమరావతి రైతుల పాదయాత్రకు స్వాగతం పలుకుతా

టీడీపీ నేత బండారు సత్యనారాయణ వ్యాఖ్యలు

సాక్షి, విశాఖపట్నం : ఒక రైతు బిడ్డగా అమరావతి రైతులు చేస్తున్న పాదయాత్రకు విశాఖలో స్వాగతం పలుకుతానని టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి వ్యాఖ్యానించారు. మంగళవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడారు. అమరావతి విషయంలో కోర్టు తీర్పుని కూడా అమలుచేయని ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే అది వైఎస్ జగన్ మాత్రమేనని విమర్శించారు. అన్నం తిన్న ప్రతి ఒక్కరూ అమరావతి రైతుల త్యాగాన్ని గుర్తించాలని వ్యాఖ్యానించారు. రైతు బిడ్డగా స్వాగతం పలకండి.. లేదంటే ఊరుకోండి తప్ప రెచ్చగొట్టే మాటలు మాట్లాడొద్దని అన్నారు. హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి ప్రతికూలంగా వచ్చినప్పుడు సుప్రీంకోర్టుకు ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. మూడు రాజధానుల బిల్లును ఉపసంహరించుకున్నప్పుడు స్పీకర్ సంతకం పెట్టిన విషయం మరిచిపోయారా అని అన్నారు. ఉత్తరాంధ్రలో మూడేళ్లలో ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టు, ఒక్క రోడ్డు ప్రాజెక్టు అయినా తేలేదని ఆరోపించారు. చంద్రబాబు మోచేతి నీరు తాగి పైకి వచ్చిన తమ్మినేని సీతారాం స్పీకర్ పదవికి మచ్చ తేకుండా వ్యవహరించాలని బండారు సూచించారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. 29 కంపార్ట్‌మెంట్‌లు నిండాయి. క్యూలైన్ టీబీసీ వద్దకు చేరుకుంది. సోమవారం అర్ధరాత్రి వరకు 74,231 మంది స్వామిని దర్శించుకోగా, 33,591 మంది తలనీలాలు సమర్పించారు. శ్రీవారి హుండీలో కానుకల రూపంలో భక్తులు రూ.5.14 కోట్లు సమర్పించుకున్నారు. దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది.

కోస్ట్‌గార్డ్ ఈస్ట్రన్ సీ బోర్డ్ కమాండర్‌గా పరమేష్



సాక్షి, విశాఖపట్నం : కోస్ట్‌గార్డ్ ఈస్ట్రన్ సీ బోర్డ్ కమాండర్‌గా అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఎస్.పరమేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం కేంద్రంగా సేవలందిస్తున్న ఈస్ట్రన్ సీ బోర్డు బాధ్యతలను పరమేష్‌కు అప్పగిస్తూ రక్షణ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఆయన ఇండియన్ కోస్ట్ గార్డ్‌లోని ప్రధాన నౌకల్లో నేవిగేషన్ అండ్ డైరెక్షన్ స్పెషలిస్ట్‌గా సేవలందించారు. ఆఫ్‌షోర్ పెట్రోల్ వెసెల్ ఐసీజీఎస్ విశ్వాస్ట్ నౌకకు ప్రాతినిధ్యం వహించారు. కోస్టల్ సెక్యూరిటీ ఆపరేషన్స్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా, కోస్ట్ గార్డ్ హెడ్ క్వార్టర్స్‌లో ప్రిన్సిపల్ డైరెక్టర్‌గా, చీఫ్ స్టాఫ్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. పరమేష్ అందించిన సేవలకు గానూ, 2012లో ప్రెసిడెంట్ తత్రక్షక్ మెడల్ అందుకున్నారు.

వచ్చే సీజన్‌కు అవుకు మూడో సొరంగం పూర్తి

జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



టన్నెల్ పనుల పురోగతిని అడిగి తెలుసుకుంటున్న మంత్రి అంబటి, ఎంపీ పోచా, ఎమ్మెల్యే కాటసాని, ఎమ్మెల్సీ చల్లా

కోవెలకుంట్ల: అవుకు రిజర్వాయర్‌కు నీరందించే మూడో సొరంగమార్గాన్ని వచ్చే సీజన్ నాటికి పూర్తిచేస్తామని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆయన మంగళవారం నంద్యాల జిల్లా పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్, బనకచర్ల, వెలుగోడు, అవుకు రిజర్వాయర్ల పరిధిలోని టన్నెల్ నిర్మాణ పనులను పరిశీలించారు. నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ చల్లా బగీరథరెడ్డి, బనగానపల్లి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డితో కలిసి సొరంగాల్లో జరుగుతున్న ఫాల్ట్‌జోన్ పనులను చూశారు. నిర్మాణాల పురోగతిని ఎస్సార్బీసీ సీఈ కబీర్‌బాషా మంత్రికి వివరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ వెలిగొండ, అవుకు రిజర్వాయర్ల పరిధిలో జరుగుతున్న పనులను రెండురోజులు పరిశీలించినట్లు చెప్పారు. శ్రీశైలం జలాశయం నుంచి ఒక్కో టన్నెల్ ద్వారా 10 వేల క్యూసెక్కుల వరద జలాలు తరలించేందుకు సొరంగ మార్గాలను ఏర్పాటు చేశామన్నారు. వీటితోపాటు మరో 10వేల క్యూసెక్కులు అవుకు రిజర్వాయర్లోకి చేరేలా మూడో సొరంగమార్గం నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయని చెప్పారు. వచ్చే సీజన్ నాటికి ఈ సొరంగం పనులను పూర్తిచేసి వరద జలాలు తరలిస్తామని ఆయన పేర్కొన్నారు. ఎస్ఈ చంగయ్య, ఎస్సార్బీసీ ఈఈ సురేష్‌బాబు, డీఈలు ప్రసాద్‌రెడ్డి, వెంకటరెడ్డి, టన్నెల్ ఇన్‌చార్జి శ్రీహరి పాల్గొన్నారు.

పెట్టుబడిదారుల యాత్రను అడ్డుకుంటాం

- ఇది రైతుల పేరుతో రియల్ వ్యాపారులు, పెట్టుబడిదారులు చేస్తున్న యాత్ర
- ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలు గౌరవించాలి
- మూడు రాజధానులతో ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యం
- విద్యార్థి జేఏసీ నాయకులు

ఏయూక్యాంపస్: రైతుల పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పెట్టుబడిదారులు చేస్తున్న అమరావతి–అరసవెల్లి పాదయాత్రను అడ్డుకుంటామని విద్యార్థి జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఈ పాదయాత్రను వ్యతిరేకిస్తూ వారు మంగళవారం విశాఖపట్నంలోని ఏయూ మెయిన్‌గేట్ వద్ద ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి జేఏసీ కన్వీనర్ బి.కాంతారావు మాట్లాడుతూ పరిపాలన వికేంద్రీకరణ రాష్ట్ర సమగ్ర వికాసానికి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు అమరావతి కేంద్రంగా అభివృద్ధిని కోరుకుంటూ అమరావతి రాజధాని కావాలని కపట నాటకాలాడుతూ పాదయాత్రలు చేపడుతున్నారని విమర్శించారు. మూడు రాజధానులతో ఉత్తరాంధ్ర ప్రాంతం సమగ్ర ప్రగతి, వికాసం సాధ్యపడుతాయని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను గమనించాలని, గౌరవించాలని డిమాండ్ చేశారు. తక్షణం విశాఖను పరిపాలన రాజధానిగా ప్రకటించాలని, దీనికి అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలపాలని కోరారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకోవడం లక్ష్యంగా చేస్తున్న పాదయాత్రను అడ్డుకుంటామని చెప్పారు. తెలుగుదేశం నాయకులకు కేవలం అమరావతి ప్రాంతంపైనే అమితమైన ప్రేమ ఉందని, ఉత్తరాంధ్ర ప్రగతిని వారు ఓర్వలేకపోతున్నారని పేర్కొన్నారు. ఇది రైతుల ముసుగులో ఉత్తరాంధ్రపై చేస్తున్న దాడిగా భావిస్తున్నామన్నారు. గతంలో హైదరాబాద్‌ను అభివృద్ధి చేసి నష్టపోయామని, అదేవిధంగా అమరావతి విషయంలో పునరావృతం కారాదని కోరుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రంలో మూడు ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికంగా ఆలోచిస్తున్నారన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల ఓట్లతో గెలిచి ఇక్కడ అభివృద్ధికి కలసిరాని ప్రజాప్రతినిధులు, నాయకులు, రాజకీయ పార్టీలను తిప్పికొడతామని, వారి కార్యాలయాలను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కె.సాయికృష్ణ, నిశేక్, శివ, నవీన్, దాస్, మాధవ్‌రెడ్డి, చార్లెస్, చందు, బాలాజీ, సోమశేఖర్, హరీష్, తేజ్, తనోజ్, శంకర్, అభినవ్, పూర్ణ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



తీరంలో దూసుకెళ్తున్న భారత్, జపాన్ యుద్ధ నౌకలు

'జిమెక్స్-2022' విన్యాసాలు ప్రారంభం

- విశాఖ వేదికగా జపాన్, భారత్ ద్వైపాక్షిక విన్యాసాలు
- 21 వరకు రెండు ఫేజ్‌లలో ప్రదర్శనలు

సాక్షి, విశాఖపట్నం : విశాఖపట్నం వేదికగా బంగాళాఖాతంలో 'జిమెక్స్–2022' విన్యాసాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జపాన్, భారత్ నౌకా, రక్షణ దళాలు రెండు ఫేజ్‌లుగా ఈ విన్యాసాలు ప్రదర్శిస్తాయి. తొలి విడతగా సీ ఫేజ్ విన్యాసాలు ఈ నెల 17 వరకు ఉంటాయి. ఈ ద్వైపాక్షిక విన్యాసాల్లో తూర్పు నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ సహ్యాద్రి, యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ ఐఎన్ఎస్ కద్మత్, ఐఎన్ఎస్ కవరత్తి, గైడెడ్ మిసైల్ డెస్ట్రాయర్ ఐఎన్ఎస్ రణ్‌విజయ్, ఫ్లీట్ ట్యాంకర్ జ్యోతి యుద్ధ నౌకలతోపాటు ఆఫ్‌షోర్ పెట్రోల్ వెసెల్స్ సుకన్య, సబ్‌మెరైన్‌లు, హెలికాప్టర్లు, సముద్రతీర నిఘా విమానం పీ8ఐ, ఎంజీ 29కే ఫైటర్స్ భారత్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. జపాన్ తరఫున హెలికాప్టర్ క్యారియర్ ఇజుమో కాగా, గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్ తకనామీ యుద్ధ విన్యాసాల్లో పాల్గొంటున్నాయి. రెండో విడతగా 18 నుంచి 21 వరకు హార్బర్ ఫేజ్ విన్యాసాలు ఉంటాయి. జపాన్ మారిటైమ్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్(జేఎంఎస్‌డీఎఫ్) షిప్‌లకు రియర్ అడ్మిరల్ హిరాటా తొషియూకీ, కమాండర్ ఎస్కార్ట్ ఫ్లోటిల్లా ఫోర్ నాయకత్వం వహించగా, భారత్ నౌకాసంపత్తికి ఈస్ట్రన్ ఫ్లీట్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండ్ రియర్ అడ్మిరల్ సంజయ్ భల్లా నేతృత్వం వహిస్తున్నారు. భారత్, జపాన్ దేశాల మధ్య 2012లో జిమెక్స్ విన్యాసాలు ప్రారంభమయ్యాయి. దీంతో ఈ ఏడాది జిమెక్స్ ద్వైపాక్షిక విన్యాసాల పదో వార్షికోత్సవాన్ని రెండు దేశాలు ఘనంగా నిర్వహిస్తున్నాయి. మరోవైపు ఈ ఏడాది భారత్, జపాన్ మధ్య దౌత్య సంబంధాలు మొదలై 70 ఏళ్లు పూర్తవుతుండటం విశేషం. ఇండో–పసిఫిక్ తీరంలో సముద్ర ప్రయోజనాలు దెబ్బతినకుండా, వైరి దేశాలు పైచేయి సాధించకుండా ఉండేందుకు జిమెక్స్ విన్యాసాలు మొదలు పెట్టినట్లు తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ బిస్వజిత్ దాస్ గుప్తా తెలిపారు. హిందూ మహాసముద్ర ప్రాంతం (ఐఓఆర్)లో అంతర్జాతీయ షిప్పింగ్, వాణిజ్య కార్యకలాపాలు సురక్షితంగా నిర్వహించేందుకు కొనసాగుతున్న ప్రయత్నాల్లో ఈ విన్యాసాలు కూడా ప్రధానమైనవని ఆయన చెప్పారు.

ఫీజు చెల్లించలేదని.. విద్యార్థులను నిర్బంధించిన శ్రీచైతన్య

- ప్రశ్నించిన తల్లిదండ్రులతో ప్రిన్సిపాల్ వాగ్వాదం
- కావలిలో ఘటన



నిర్బంధంలో ఉన్న విద్యార్థులు

కావలి (శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా): ఫీజులు కట్టలేదనే కారణంతో శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ పలువురు విద్యార్థులను గదిలో నిర్బంధించారు. ఈ ఘటన మంగళవారం కావలిలో జరిగింది. వివరాలు.. పుల్లారెడ్డి నగర్‌లోని శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ లేకా సురేశ్ మంగళవారం ఉదయం వివిధ తరగతులకు చెందిన 14 మంది విద్యార్థులను ఓ గదిలో పెట్టి నిర్బంధించారు. దీంతో ఆ విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, పీడీఎస్‌యూ నాయకుడు కె.భాస్కర్ స్కూల్‌కు చేరుకొని ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. ఫీజులు కట్టకపోతే ఇంకేం చేయాలంటూ ఆయన దురుసుగా జవాబిచ్చారు. ఫీజుల కోసం పిల్లల్ని హింసిస్తారా అంటూ తల్లిదండ్రులు ప్రశ్నించడంతో.. ప్రిన్సిపాల్ సురేశ్ వారితో వాగ్వాదానికి దిగాడు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. శ్రీచైతన్య స్కూల్ యాజమాన్యం, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, పీడీఎస్‌యూ నాయకుడు భాస్కర్ డిమాండ్ చేశారు.

అలింకో ద్వారా దివ్యాంగులకు పరికరాలు

కేంద్ర మంత్రి ఎ.నారాయణస్వామి



కేంద్రమంత్రి నారాయణస్వామికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి

ఒంగోలు: అలింకో ద్వారా దివ్యాంగులకు అవసరమైన పరికరాలను అందజేస్తున్నట్లు కేంద్ర సామాజిక న్యాయసాధికారత శాఖ మంత్రి ఎ.నారాయణస్వామి చెప్పారు. మంగళవారం ఒంగోలు వచ్చిన ఆయన్ని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, బీజేపీ నేతలు కలిశారు. అనంతరం కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడారు. ఆర్టిఫీషియల్ లింబ్స్ మాన్యుఫాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(అలింకో) ద్వారా పాండిచ్చేరి, తమిళనాడు, కేరళ, ఉత్తరప్రదేశ్, అసోం తదితర రాష్ట్రాల్లో దివ్యాంగులకు పరికరాలు అందజేసినట్లు తెలిపారు. ఒంగోలులో జరిగే పంపిణీ కార్యక్రమానికి ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆహ్వానం మేరకు తాను వచ్చినట్లు చెప్పారు. అలాగే ప్రధాని మోదీ ఆదేశాల మేరకు వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఏ పథకం అమలులో అయినా సమస్య ఉంటే దానిని సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తున్నామన్నారు. తాము గుర్తించిన లోపాలను, నిర్లక్ష్యాన్ని, అవినీతిని రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా తెలియజేస్తామన్నారు.

కేసీఆర్‌వి పిచ్చి కలలు..

ప్రతి ఒక్కరూ నలుగురైదుగురు ఎంపీలు, ఇండిపెండెంట్లతో ప్రధాని అయిపోదామని పిచ్చి కలలు కంటున్నారని కేంద్ర మంత్రి నారాయణస్వామి విమర్శించారు. తెలంగాణ సీఎం కేసీఆర్ కూడా ఇలాగే పిచ్చి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. 'ముఖ్యమంత్రిగా ఐదేళ్లలో రాష్ట్రానికి ఏం చేశారు? రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఇంకా ఏం చేయాలనే దానిపై ముందు దృష్టి పెట్టండి' అని కేంద్ర మంత్రి సూచించారు.

పాదయాత్రను సిక్కోలులో అడుగుపెట్టనీయం

- విశాఖ రాజధాని కోసం ప్రాణత్యాగాలకైనా సిద్ధం
- నాన్ పొలిటికల్ జేఏసీ సమావేశంలో మంత్రి అప్పలరాజు



జేఏసీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

కాశీబుగ్గ: మహాపాదయాత్ర పేరిట వస్తున్న భ్రమరావతి రైతులను సిక్కోలులో అడుగు పెట్టనివ్వబోమని రాష్ట్ర పశుసంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లా పలాసలో మంగళవారం నాన్ పొలిటికల్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. విశాఖపట్నం పరిపాలన రాజధానికి మద్దతుగా నిలుస్తున్నామని సభ్యులతో కలిసి మంత్రి ప్రమాణం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అమరావతిలోనే రాజధాని కావాలని, విశాఖపట్నం వద్దని ఇక్కడికి వచ్చి జులుం చూపిస్తే ఎవరూ ఊరుకోరని స్పష్టం చేశారు. విశాఖ, విజయనగరం, మన్యం, సిక్కోలు ప్రాంతీయులకు ఎంతో మేలుజరిగే విశాఖను కాదని అమరావతి అంటే సహించేది లేదని, ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. భ్రమరావతి రైతుల పాదయాత్ర సిక్కోలు వస్తే పైడి భీమవరంలోనే అడ్డుకుంటామని స్పష్టం చేశారు. చంద్రబాబు మాత్రమే అధికారంలో ఉండేలా, కొన్ని కుటుంబాలకే అమరావతి భూములు కేటాయించారని గుర్తుచేశారు. ఇతర కులాలకు భూములు లేకుండా సామాజిక సమతుల్యత దెబ్బతీశారని, ముఖ్యంగా బహుజనులను దూరం పెట్టారని మండిపడ్డారు. తనకే గనక పవర్ ఉంటే చంద్రబాబుపై అట్రాసిటి కేసు పెట్టేవాడినన్నారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశిస్తుంటే చంద్రబాబు మాత్రం ఒక్క ప్రాంతానికి కొమ్ము కాస్తున్నారని దుయ్యబట్టారు. అమరావతి కోసం పాదయాత్రల పేరుతో రాష్ట్రం మొత్తం చాలెంజ్ విసురుతున్నారని, మనం అందరం కలిసి అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఇక్కడ వ్యాపారాలు, నాయకత్వం, బంధుత్వం చేసినవారు ఈ ప్రాంత అభివృద్ధికి కాకుండా అమరావతి కోసం పాటుపడటం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ఉత్తరాంధ్రలోని ఎమ్మెల్యేలందరితో కార్యాచరణ రూపొందించి నిరసన చేపట్టి విశాఖే రాజధాని కావాలని పట్టుబడతామని చెప్పారు. అమరావతి రైతులు భూములిచ్చి ఏదో కోల్పోయినట్లు మాట్లాడుతున్నారని, అలాగైతే పోలవరం, వంశధార వంటి ప్రాజెక్టుల్లో రైతులు ఇళ్లు, భూములను విడిచి సమస్తం త్యాగాలు చేశారని గుర్తుచేశారు. త్వరలో పదివేలమందితో నిరసన కార్యక్రమం చేపడతామని, విశాఖ రాజధాని కోసం ప్రాణాలైనా అర్పిస్తామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, జేఏసీ ప్రతినిధులు దువ్వాడ జీవితేశ్వరరావు, చిగురువలస జగదీశ్వరరావు, హనుమంతు వెంకటరావుదొర, వివిధ పార్టీల నాయకులు, ఉద్యోగసంఘాల ప్రతినిధులు, అన్ని సామాజిక వర్గాల నాయకులు, మేధావులు తదితరులు పాల్గొన్నారు.

ఈనాడువి బిల్డప్ రాతలు

మాజీమంత్రి కన్నబాబు



ఈనాడు రాతలను మీడియా సమావేశంలో చూపుతున్న మాజీ మంత్రి కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: 'రాష్ట్రంలో తిరుగులేని జనశక్తితో అమరావతి పాదయాత్ర మహోద్యమంలా జరుగుతోందన్నట్లు 'ఈనాడు' బిల్డప్.. జయహో అమరావతి అని బ్యానర్.. లోపలి పేజీల్లోకి వెళ్తే ఈ ఉద్యమం మనది, దానిని కాపాడుకోవాలన్నట్లు పుంఖానుపుంఖాలుగా కథనాలు. అవి చూస్తే ఆశ్చర్యం వేసింది'.. అని మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. కాకినాడలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. ఈరోజు ఈనాడు మొత్తం చదివాను. అమరావతి పాదయాత్రకు వచ్చిన వారి ఫొటోలు వేశారు. వారేం అనుకుంటున్నారో మనసులో మాట కూడా చెప్పారు. జేఏసీ నాయకులు 'నారా హమారా.. అమరావతి హమరా' అంటూ నినాదం ఇచ్చారట. దీనినిబట్టి ఈ మొత్తం కథ నారా వారి దర్శకత్వం, నిర్మాణంలోనే అమరావతి పాదయాత్ర జరుగుతున్నట్లు రాష్ట్ర ప్రజలకు అర్థమవుతోంది. కానీ, మేము, ప్రజలు 'నారా తుమ్హారా.. అమరావతి తుమ్హారా' అని చెబుతున్నాం.

ఒక పార్టీ కోసమే ఇదంతా..

ఇక అమరావతిపై ప్రెస్‌మీట్ పెడితే టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి స్పందిస్తారు. అలాగే, అమరావతిపై ఉద్యమం అయితే తెలంగాణ నుంచి రేణుకాచౌదరి వస్తారు. ఈ పాదయాత్రలో బీజేపీ నేతలు పాల్గొన్నారు. ఒకే ట్రాక్టర్‌పై టీడీపీ నేత మాగంటి బాబు, సీపీఐ నారాయణ కూర్చున్నారు. ఈ మొత్తాన్ని చూసి ఒక రాజకీయ పార్టీ అవసరాల కోసం, దాని ప్రోత్సాహం కోసం కొంతమంది ఈ ఉద్యమం నడుపుతున్నారని ప్రజలు విశ్వసిస్తున్నారు. ఇదే విషయాన్ని మేం చెబితే బుచ్చయ్యచౌదరి నన్ను పనికిమాలిన దద్దమ్మ అని తిట్టారంట. ఈనెల 15 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో 'నారా హమారా.. అమరావతి హమారా' నినాదంపై చర్చిద్దాం రండి. ఇక కులంలో కొడాలి నాని చెడపుట్టాడంటూ బుచ్చయ్య చౌదరి అంటున్నారు. టీడీపీకి మద్దతిచ్చేవారు మాత్రమే గౌరవప్రదులా? అమరావతి మహోద్యమం అని చిత్రీకరిస్తే ఎలా? కర్నూలులో న్యాయ రాజధాని, విశాఖలో పరిపాలన రాజధాని వద్దనడానికి మీకు హక్కు ఎక్కడిది? అమరావతి శాసన రాజధానిగా ఉంటుంది. ప్రాంతాల మధ్య వైషమ్యాలు వచ్చేలా టీడీపీ నేతలు మాట్లాడితే వైఎస్సార్‌సీపీ చూస్తూ ఊరుకోదు.

ఆ యాత్ర ఉద్దేశమేంటి?

అమరావతి నుంచి అరసవల్లి వరకు యాత్ర వెనుక అసలు ఉద్దేశమేమిటి? ఎక్కడైనా ఏదైనా జరిగితే సీఎం వైఎస్ జగన్‌పైన, మా ప్రభుత్వంపైన బురద జల్లడానికి మీరు చేస్తున్న కుట్రే ఇదంతా. రాష్ట్రమంతా మనదనే భావన మాది. అమరావతి మీదనే భావన మీది. చంద్రబాబు కుట్ర రాజకీయాలకు ఫలితాలెలా ఉంటాయో గత ఎన్నికల్లోనే ప్రజలు చూపించారు.

అమరావతి అభివృద్ధికి కులవాదులే అడ్డు

716వ రోజు రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నాయకులు

తాడికొండ : అమరావతి అభివృద్ధికి టీడీపీ ముసుగులో ఉన్న కులవాదులే అడ్డుగా మారారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 716వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు మంగళవారం పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. రాజధాని ప్రాంతం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా ముందుకొచ్చినా కొంతమంది తమ స్వార్థ ప్రయోజనాల కోసం తిరస్కరిస్తున్నారని మండిపడ్డారు. గతంలో అమరావతి క్యాపిటల్ సిటీ మునిసిపల్ కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తే వ్యతిరేకించడంతో పాటు, ఇప్పుడు మునిసిపాలిటీ ఏర్పాటుకు ముందుకొచ్చినా బాబు అండ్ కో వెనుక ఉండి తప్పుడు వాదనలతో అడ్డుపడుతుండటం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు చూపించిన గ్రాఫిక్స్ డిజైన్‌లకు అలవాటు పడిన కొంతమంది.. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం రైతులను తప్పుదారి పట్టించి తమ స్వార్థానికి బలిచేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో నేతలు బేతపూడి సాంబయ్య, జోషి, ఈపూరి ఆదాం, పులి దాసు పాల్గొన్నారు.

స్వాత్మానందేంద్ర సరస్వతికి 'గీతాచరణం' అందజేత



స్వాత్మానందేంద్ర సరస్వతికి గీతాచరణం పుస్తకాన్ని అందజేస్తున్న శివప్రసాద్

సింహాచలం: విశాఖ శ్రీశారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతిని మంగళవారం ఢిల్లీలో పంజాబ్ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, రచయిత కె.శివప్రసాద్ కలిసి తాను రచించిన గీతాచరణం అనే పుస్తకాన్ని అందజేశారు. గీతాసారాన్ని తక్కువ సమయంలో సంపూర్ణంగా తెలుసుకోవడానికి ఈ పుస్తకం దోహదపడుతుందని శివప్రసాద్ తెలిపారు. శివప్రసాద్ వెంట ఏపీ దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్, ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్‌ప్రకాష్ ఉన్నారు.

'మోపిదేవి' దంపతులకు స్వాత్మానందేంద్ర సరస్వతి ఆశీస్సులు

స్వాత్మానందేంద్ర సరస్వతిని ఢిల్లీలో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ సతీసమేతంగా మంగళవారం కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. మోపిదేవికి స్వామీజీ రాజశ్యామల అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి వసుధా మిశ్రా కూడా స్వాత్మానందేంద్ర సరస్వతిని కలిసి ఆశీస్సులు పొందారు.

మేకపాటి కుటుంబానికి దత్తాత్రేయ పరామర్శ



మేకపాటి రాజమోహన్‌రెడ్డితో మాట్లాడుతున్న బండారు దత్తాత్రేయ

నెల్లూరు (సెంట్రల్): మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ నాయకుడు మేకపాటి రాజమోహన్‌రెడ్డి కుటుంబాన్ని మంగళవారం హైదరాబాద్‌లో హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ పరామర్శించారు. మేకపాటి రాజమోహన్‌రెడ్డితో కొద్దిసేపు మాట్లాడారు. యువ నాయకుడు, దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి హఠాన్మరణం రాష్ట్రానికి, తెలుగు ప్రజలకు తీరని లోటు అని దత్తాత్రేయ పేర్కొన్నారు. గౌతమ్‌రెడ్డి తన తండ్రి మేకపాటి రాజమోహన్‌రెడ్డి అడుగుజాడల్లో నడిచి ప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేశారని కొనియాడారు.

క్లుప్తంగా

ఆయుష్‌లో యోగా శిక్షకుల పేరుతో తప్పుడు ప్రచారం

ఆయుష్ కమిషనర్ సూచన

సాక్షి, అమరావతి: ప్రభుత్వం ఆయుష్ విభాగంలో పార్ట్‌టైమ్ యోగా శిక్షకులను నియమిస్తున్నట్టు జరుగుతున్న ప్రచారాన్ని నమ్మి మోసపోవద్దని ఆయుష్ కమిషనర్ రాములు మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు. యోగా శిక్షకులను తాత్కాలికంగా తీసుకుని భవిష్యత్‌లో వారి సేవలను క్రమబద్ధీకరిస్తారంటూ కొందరు ప్రచారం చేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆయుష్ విభాగంలో నియామకాలకు సంబంధించి తాము ఏ ఏజెన్సీకి అధికారం ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఆయుష్ పేరుతో ఏజెన్సీలు చేపట్టే తప్పుడు నియామక ప్రక్రియలను నమ్మి మోసపోవద్దని సూచించారు.

వైద్య విధాన పరిషత్‌లో పలు కేడర్లలో మార్పులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్య శాఖను బలోపేతం చేయడంలో భాగంగా ప్రభుత్వం ఏపీ వైద్య విధాన పరిషత్ పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో పలు పోస్టుల కేడర్‌ను మారుస్తూ ఇటీవల కేబినెట్ సమావేశం ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించి మంగళవారం వైద్య శాఖ సవరించిన ఉత్తర్వులను విడుదల చేసింది. ఈ మేరకు 91 డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్టుల కేడర్‌ను సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేశారు. మరో 169 డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్టులను (168 సీఏఎస్ స్పెషలిస్ట్, ఒక సీఏఎస్ జనరల్) సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల కేడర్‌కు తగ్గించారు. మరో 11 సీఎస్-ఆర్ఎంవోలు, 42 సీఎస్-డెంటల్ పోస్టులను సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టులుగా మార్చారు. 25 సీనియర్ అసిస్టెంట్ పోస్టులను ఆఫీస్ సూపరింటెండెంట్ స్థాయికి అప్‌గ్రేడ్ చేశారు.

విశాఖను పాలన రాజధానిగా చేసి తీరతాం

• వైవీ సుబ్బారెడ్డి



సాక్షి, అనకాపల్లి: న్యాయపరమైన చిక్కులు తొలగిన వెంటనే విశాఖను పరిపాలన రాజధాని చేసి తీరతామని ఉమ్మడి విశాఖ జిల్లా వైఎస్సార్‌సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. ప్రాంతాల మధ్య విద్వేషాలు సృష్టించేందుకే అమరావతి పేరిట చంద్రబాబు పాదయాత్ర చేస్తున్నారని పేర్కొన్నారు. దీనికి ఉత్తరాంధ్ర ప్రజలంతా శాంతియుతంగా నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. అనకాపల్లిలో మంగళవారం నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు దుష్టచతుష్టయంతో కలిసి మూడు రాజధానులపై వాస్తవాలను అవాస్తవాలుగా చూపించేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అంతకుముందు ఆయన పెందుర్తి మండలం రాంపురం గ్రామంలో వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. గాజువాకలోని నడుపూరులో జగనన్న కాలని భూమిపూజలో పాల్గొన్నారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి, విశాఖ జిల్లాల పార్టీ అధ్యక్షులు కరణం ధర్మశ్రీ, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ భీశెట్టి సత్యవతి, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్యేలు గొల్ల బాబురావు, పెట్ల ఉమాశంకర్‌గణేష్, కన్నబాబురాజు, విశాఖ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎస్.సుధాకర్ పాల్గొన్నారు.

జన అజెండా

రేపటి నుంచి అసెంబ్లీ, మండలి సమావేశాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా శాసన సభలో విస్తృతంగా చర్చించేందుకు అధికార పక్షం సన్నద్ధమవుతోంది. రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తూ దుష్ట చతుష్టయం చేస్తున్న దుష్ప్రచారాన్ని చట్టసభల వేదికగా తిప్పికొట్టి నిజానిజాలను ప్రజలకు వివరించనుంది. గురువారం ఉదయం 9 గంటలకు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానుండగా 10 గంటలకు శాసన మండలి సమావేశాలు మొదలవుతాయి. అసెంబ్లీ, మండలి సమావేశాలు ఐదు రోజుల పాటు జరిగే అవకాశం ఉందని అధికార వర్గాల సమాచారం. శనివారం, ఆదివారం సమావేశాలకు సెలవు ఉంటుంది. తిరిగి సోమవారం నుంచి బుధవారం వరకు సమావేశాలు జరిగే అవకాశం ఉంది. శాసన సభా వ్యవహారాల సలహా సంఘం (బీఏసీ) భేటీలో సమావేశాలను ఎన్ని రోజులు నిర్వహించాలనే అంశంపై నిర్ణయం తీసుకోనున్నారు.

▲ అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా చట్టసభల్లో చర్చించేందుకు అధికార పక్షం సర్వ సన్నద్ధమైంది. పాలనా వికేంద్రీకరణలో భాగంగా మూడు ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు ఇప్పటికే ప్రకటించిన మేరకు అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని అధికార పక్షం నిర్ణయించింది. కొత్త జిల్లాల ఏర్పాటు, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పాలనా వికేంద్రీకరణకు తీసుకున్న చర్యలు, ఇప్పటికే చేపట్టిన పరిపాలన సంస్కరణలపై విస్తృతంగా చర్చించేందుకు సిద్ధమవుతోంది.

▲ ప్రజలకు తప్పుడు సమాచారాన్ని చేరవేయడంతోపాటు రాష్ట్ర ప్రతిష్టను దిగజారుస్తూ పదేపదే అప్పులపై దుష్ట చతుష్టయం చేస్తున్న దుష్ప్రచారాన్ని అసెంబ్లీ వేదికగా గట్టిగా తిప్పికొట్టి ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని అధికార పక్షం నిర్ణయించింది. అప్పులతో పాటు పారిశ్రామిక పెట్టుబడులపై కూడా దుష్టచతుష్టయం విషం చిమ్ముతోంది. రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులపై జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారం చేస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి వచ్చిన పారిశ్రామిక పెట్టుబడులతో పాటు రానున్న పెట్టుబడుల వివరాలను కూడా అసెంబ్లీ వేదికగా రాష్ట్ర ప్రజానీకానికి తెలియజేయాలని అధికార పక్షం నిర్ణయించింది. మరో పక్క కోవిడ్ సంక్షోభంలోనూ దేశంలోనే అత్యధికంగా రాష్ట్రం రెండంకెల వృద్ధిని గత ఆర్థిక ఏడాదిలో సాధించింది. మిగతా రాష్ట్రాల కంటే మిన్నగా అత్యధిక వృద్ధి సాధించడానికి తీసుకున్న చర్యలను అసెంబ్లీ ద్వారా ప్రజలకు వివరించనుంది.

▲ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విద్య, వైద్య రంగాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. ప్రభుత్వ రంగ విద్యా సంస్థలను బలోపేతం చేయడం ద్వారా నాణ్యమైన బోధనతో పేద, సామాన్య వర్గాల పిల్లలు ప్రపంచంతో పోటీ పడేలా తీసుకుంటున్న చర్యలను అసెంబ్లీ వేదికగా అధికార పక్షం వివరించనుంది. ప్రభుత్వ ఆస్పత్రులకు జవసత్వాలు కల్పించి అన్ని సదుపాయాలతో తీర్చిదిద్దడంతోపాటు ఏకంగా 16 కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని చేపట్టడం, హెల్త్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా గ్రామాల్లోనే ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించేలా చేపట్టిన చర్యలను అసెంబ్లీ ద్వారా తెలియచేయనుంది.

▲ మహిళా సాధికారికతకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది. మహిళలు, పిల్లల భద్రతకు పలు చర్యలను తీసుకుంది. ఇటీవల నేషనల్ క్రైం బ్యూరో నివేదిక కూడా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల కారణంగా నేరాలు తగ్గిన విషయాన్ని తెలియజేసింది. ఈ అంశాలను అసెంబ్లీలో చర్చించి ప్రజలకు తెలియజేయాలని అధికారపక్షం నిర్ణయించింది.

▲ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా చేకూర్చిన న్యాయంపై అసెంబ్లీలో చర్చించాలని అధికార పక్షం నిర్ణయించింది. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన తీరుతో పాటు నేరుగా నగదు బదిలీ ద్వారా పారదర్శకంగా చేకూర్చిన లబ్ధిపై అసెంబ్లీల్లో చర్చించి వివరించనుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా 30 లక్షల మందికిపైగా పేద మహిళలకు వారి పేరిటే ఇళ్ల స్థలాలను ఇవ్వడమే కాకుండా గృహ నిర్మాణాలను కూడా ప్రభుత్వం చేపట్టింది. ఈ అంశంపైన అసెంబ్లీలో చర్చించాలని అధికార పక్షం నిర్ణయించింది.

▲ పోలవరంపై గత ప్రభుత్వ నిర్వాకాలను చట్టసభల వేదికగా బహిర్గతం చేయడంతోపాటు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రాజెక్టును శరవేగంగా పూర్తి చేసేలా తీసుకుంటున్న చర్యల గురించి అసెంబ్లీలో చర్చించాలని అధికార పక్షం నిర్ణయించింది. మద్యం, ఇసుకపై దుష్ట చతుష్టయం దుష్ప్రచారాన్ని తిప్పికొట్టి వాస్తవాలను అసెంబ్లీ వేదికగా ప్రజలకు వివరించనుంది.

అది ప్రభుత్వ విధాన నిర్ణయం

• నంద్యాల జిల్లాకు ఉయ్యాలవాడ పేరు పెట్టాలన్న పిల్ కొట్టివేత

సాక్షి, అమరావతి : జిల్లాకు ఏ పేరు పెట్టాలన్నది ప్రభుత్వ విధాన నిర్ణయమని హైకోర్టు తేల్చి చెప్పింది. జిల్లాకు ఫలానా వ్యక్తి పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని ఆదేశించడం న్యాయస్థానం పని కాదని స్పష్టం చేసింది. కొత్తగా ఏర్పాటైన నంద్యాల జిల్లాకు ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి పేరు పెట్టేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ సామాజిక కార్యకర్త కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్‌ను) హైకోర్టు మంగళవారం కొట్టేసింది. ఏదైనా జిల్లాకు లేదా పట్టణానికి రాజకీయ నేత, స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, యోగి, ఇతర ప్రఖ్యాత వ్యక్తి పేరు పెట్టడం పూర్తిగా ప్రభుత్వ పరిధిలోనిదని స్పష్టంచేసింది. ఒకవేళ కోర్టు అలాంటి ఆదేశం ఇవ్వాలంటే, రాష్ట్ర ప్రభుత్వం చట్ట ఉల్లంఘనకు లేదా ప్రజల చట్టబద్ధ హక్కుల ఉల్లంఘనకు పాల్పడినట్లు పిటిషనర్ నిరూపించాల్సి ఉంటుందని తెలిపింది. జిల్లాలకు పేరు పెట్టే విషయంలో నిర్దిష్ట ప్రమాణాలతో కూడిన చట్టం ఏదీ లేదని చెప్పింది. కాబట్టి ఈ వ్యాజ్యాన్ని కొట్టేస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్‌ఎస్ సోమయాజులు ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది.

కరకట్ట ఆక్రమణలైనా కూల్చాల్సిందే

▶ మొదటి పేజీ తరువాయి

ఆక్రమించి చేపట్టిన నిర్మాణాల సంగతి తేలుస్తామన్న హైకోర్టు.. ఈ వ్యవహారాన్ని సుమోటో పిల్‌గా మలిచిన విషయం తెలిసిందే. ఈ తరహా ఆక్రమణలన్నింటిపై దాఖలైన వ్యాజ్యాలన్నింటినీ ఈ సుమోటో పిల్‌కు జత చేసిన ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజుల ధర్మాసనం.. వీటిపై మంగళవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) చింతల సుమన్ వాదనలు వినిపిస్తూ, కృష్ణానది పరీవాహక ప్రాంతాన్ని ఆక్రమించుకుని కరకట్ట వద్ద నిర్మాణాలు చేపట్టారని, వాటికి సంబంధించిన వ్యాజ్యాలు పెండింగ్‌లో ఉన్నాయని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఆ నిర్మాణాల సంగతి కూడా చూస్తామని, తమకు ఎవరైనా ఒకటేనని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వ న్యాయవాది (రెవెన్యూ) పోతిరెడ్డి సుభాష్ రెడ్డి స్పందిస్తూ, ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని 30-40 ఏళ్ల క్రితమే చేపట్టిన నిర్మాణాల సంగతి ఏమిటని అడిగారు. అలాంటి నిర్మాణాలను సైతం కూల్చి వేయాల్సిందేనని ధర్మాసనం స్పష్టం చేసింది. అన్ని వ్యాజ్యాల్లో ఉమ్మడి ఉత్తర్వులు జారీ చేస్తామంది. ఆక్రమణదారులను ఖాళీ చేయించాల్సిందేనని, ప్రభుత్వం తీసుకొచ్చిన క్రమబద్ధీకరణ పథకం ద్వారా క్రమబద్ధీకరణ చేసుకున్న వారు మినహా ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న మిగిలిన వారంతా ఖాళీ చేయాల్సిందేనని తేల్చి చెప్పింది. ఈ సమయంలో న్యాయవాది యలమంజుల బాలాజీ జోక్యం చేసుకుంటూ, వినుకొండలో మునిసిపాలిటీయే డిగ్రీ కాలేజీ భూమిని ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతోందని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని మునిసిపల్ కార్పొరేషన్ తరఫు న్యాయవాదిని ఆదేశించిన ధర్మాసనం విచారణను ఈ నెల 16కి వాయిదా వేసింది.

ఇలా కుమ్మక్కవుతారు

తామిచ్చిన ఆదేశాల ప్రకారం ఆక్రమణల తొలగింపునకు అధికారులు చర్యలు మొదలు పెట్టగానే, కొందరు హైకోర్టు సింగిల్ జడ్జి వద్ద పిటిషన్లు దాఖలు చేస్తారని, తామిచ్చిన ఉత్తర్వుల సంగతి సింగిల్ జడ్జికి చెప్పకుండా స్టే ఉత్తర్వులు పొందుతారని ధర్మాసనం తెలిపింది. అధికారులు సైతం తమ ఉత్తర్వుల సంగతిని సింగిల్ జడ్జి దృష్టికి తీసుకురారని, ధర్మాసనం ఇచ్చిన ఉత్తర్వుల సంగతి తెలియని సింగిల్ జడ్జి.. పిటిషనర్లకు అనుకూలంగా స్టే ఉత్తర్వులు ఇస్తారని వివరించింది. ఇలా పిటిషనర్లు, రెవెన్యూ అధికారులు కలిసి కుమ్మక్కవుతారని ఘాటుగా వ్యాఖ్యానించింది.

రాజ్యాంగం ఆక్రమించుకోమని చెప్పిందా?

గ్రామ కంఠం భూములను ఆక్రమించుకుని 30-40 ఏళ్ల క్రితమే నిర్మాణాలు చేపట్టారని, ఇప్పుడు హైకోర్టు ఆదేశాలు ఇస్తే అధికారులు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా, తమ వాదన వినకుండా ఆ నిర్మాణాలను కూల్చేస్తారని న్యాయవాది విద్యావతి ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. కూల్చి వేతలకు ముందు అధికారులు తప్పక వాదనలు వినిపించుకునే అవకాశం ఇస్తారని, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ధర్మాసనం తేల్చి చెప్పింది. తమ జీవనాధారాన్ని కూడా చూడాలని, రాజ్యాంగం ప్రసాదించిన జీవించే హక్కును పరిగణనలోకి తీసుకోవాలని విద్యావతి కోరారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. రాజ్యాంగం ప్రభుత్వ భూములను ఆక్రమించుకోమని చెప్పిందా? అని ప్రశ్నించింది.

రెవెన్యూ అధికారుల వల్లే ఆ పరిస్థితి

ప్రభుత్వ న్యాయవాది సుభాష్ స్పందిస్తూ.. దాదాపు 5 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణల్లో ఉందని తెలిపారు. ధర్మాసనం స్పందిస్తూ, ఇందులో రెవెన్యూ అధికారుల పాత్ర కూడా ఉందని తెలిపింది. రెవెన్యూ అధికారుల ఉదాసీనత, నిర్లక్ష్యం, అవినీతి కారణంగానే ప్రభుత్వ భూముల ఆక్రమణలు పెరిగిపోయాయని స్పష్టం చేసింది. ఈ సమయంలో ఓ న్యాయవాది స్పందిస్తూ, గుంటూరులో శ్మశాన వాటికను ఆక్రమించుకుని షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. శ్మశానంలో షాపింగ్ కాంప్లెక్సా అంటూ ధర్మాసనం విస్మయం వ్యక్తం చేసింది. కాగా, వివిధ రకాల ఆక్రమణలపై దాఖలైన 55 పిటిషన్లకు సంబంధించి తగిన ఉత్తర్వులు జారీ చేసేందుకు వీలుగా వ్యాజ్యాలను ప్రభుత్వ భూముల ఆక్రమణ, చెరువుల ఆక్రమణ, శ్మశానాల ఆక్రమణ, తదితర అంశాల వారీగా ధర్మాసనం విభజించింది. వీటిపై తదుపరి విచారణ నిమిత్తం కొన్నింటిని బుధవారం, మరి కొన్నింటిని గురువారానికి, ఇంకొన్నింటిని సోమవారానికి వాయిదా వేసింది.

పీజీటీ, టీజీటీలపై కఠిన చర్యలొద్దు

• హాస్టల్ వార్డెన్ విధులు నిర్వర్తించాలని ఒత్తిడి చేయొద్దు
• ఆదివారం పనిచేసేందుకు సిద్ధంగా ఉన్న వారి సేవలే వాడుకోండి
• పాఠశాల విద్యాశాఖ అధికారులకు హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి : మోడల్ స్కూళ్లకు అనుబంధంగా ఉన్న బాలికల హాస్టళ్ల వార్డెన్లు వారాంతపు సెలవు తీసుకున్నప్పుడు ఆ బాధ్యతలను రొటేషన్ పద్ధతిపై నిర్వర్తించేందుకు ముందుకు రాని పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లు (పీజీటీ), ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు (టీజీటీ)పై కఠిన చర్యలేవీ తీసుకోవద్దని హైకోర్టు పాఠశాల విద్యాశాఖ అధికారులను ఆదేశించింది. వార్డెన్ విధులు నిర్వర్తించాలని ఒత్తిడి చేయవద్దని ఆదేశించింది. వార్డెన్ విధులకు సిద్ధమైన పీజీటీ, టీజీటీలకే బాధ్యతలు అప్పగించాలని స్పష్టంచేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కుంభజడల మన్మథరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సెలవు రోజున అసలు వార్డెన్ స్థానంలో పీజీటీ, టీజీటీలు పనిచేయాలన్న నిబంధన కఠినమైనదే అయినప్పటికీ, ఏపీ స్టేట్ అండ్ సబార్డినేట్ రూల్స్ 1996లోని రూల్ 10(ఎ) ప్రకారం యజమాని ఆదేశాలను ఉద్యోగి పాటించి తీరాలని న్యాయమూర్తి పేర్కొన్నారు. హాస్టళ్ల నిర్వహణకు అవసరమైన పోస్టులను సృష్టించి, అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు తగిన యత్నాలు చేయాలని అధికారులను ఆదేశించారు. తద్వారా హాస్టల్ డ్యూటీ నుంచి పీజీటీ, టీజీటీలకు విముక్తి కల్పించాలన్నారు. వార్డెన్లు వారాంతపు సెలవు తీసుకున్నప్పుడు ఆ బాధ్యతలను రొటేషన్ పద్ధతిలో నిర్వర్తించాలంటూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను సవాలు చేస్తూ పలువురు పీజీటీ, టీజీటీలు దాఖలు చేసిన వ్యాజ్యంపై జస్టిస్ మన్మథరావు విచారణ జరిపారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది పి.రాజేష్ బాబు వాదనలు వినిపిస్తూ, విద్యా శాఖాధికారులు ఇచ్చిన ప్రొసీడింగ్స్ చట్ట విరుద్ధమని తెలిపారు. పాఠశాల విద్యాశాఖ తరఫున న్యాయవాది కేవీ రఘువీర్ వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వ ఉద్యోగులైన పీజీటీ, టీజీటీలు సర్వీసు రూల్స్ ప్రకారం ప్రభుత్వ ఆదేశాలను పాటించాల్సిందేనన్నారు. వారు నెలకో, రెండు నెలలకో ఓ రోజున వార్డెన్‌గా పని చేయాల్సి ఉంటుందన్నారు.

రెండో రోజు కొనసాగిన అమరావతి జేఏసీ పాదయాత్ర

మంగళగిరి: అమరావతిని రాజధానిగా కొనసాగించాలంటూ అమరావతి టూ అరసవల్లికి అమరావతి జేఏసీ చేపట్టిన పాదయాత్ర రెండవ రోజు మంగళగిరి మీదుగా కొనసాగింది. మంగళవారం ఉదయం పట్టణంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయం వద్ద పూజలు నిర్వహించి ద్వారకానగర్, రాజీవ్‌సెంటర్, తెనాలి ఫ్లై ఓవర్‌ల మీదుగా వెళ్లి పెదవడ్లపూడి, రేవేంద్రపాడుల మీదుగా దుగ్గిరాల చేరుకుంది. పాదయాత్రకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, పీసీసీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజధాని మార్చడం ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనమన్నారు. సీఆర్‌డీఏ చట్టం మార్చవద్దని హైకోర్టు తీర్పు చెప్పినా ప్రభుత్వం తన ధోరణి మార్చుకోకుండా మూడు రాజధానులంటూ ప్రకటనలు చేయడం దుర్మార్గమన్నారు. కాగా, పెదవడ్లపూడిలో బీజేపీ నేత, జెడ్పీ మాజీ చైర్మన్ పాతూరి నాగభూషణం, టీడీపీ యువ నాయకుడు జువ్వాది చందు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో చందు వర్గం యాత్ర నుంచి తిరుగుముఖం పట్టింది. పాదయాత్రలో టీడీపీ నాయకులు పలువురు పాల్గొన్నారు.



మంగళగిరిలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయం వద్ద నుంచి ప్రారంభమైన పాదయాత్ర

ఆ జీఓలపై స్టే ఇవ్వం

▶ మొదటి పేజీ తరువాయి

ఇవ్వలేమని తెలిపింది. తదుపరి విచారణను అక్టోబర్ 11కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది.

ఏజీ చెప్పిన వివరాలను పరిగణనలోకి..

పాఠశాలల విలీనం, ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం జారీచేసిన జీఓలను సవాలు చేస్తూ తాజాగా ఏపీ విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ డి. రమేశ్‌చంద్ర సింహగిరి పట్నాయక్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంతో పాటు ఇదే అంశంపై గతంలో దాఖలైన వ్యాజ్యాలు మంగళవారం సీజే ధర్మాసనం ముందు విచారణకు వచ్చాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్. శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. విలీనం, హేతుబద్ధీకరణ ప్రభుత్వ విధాన నిర్ణయమన్నారు. ఇందులో ఇప్పటికే అధిక శాతం అమలైందన్నారు. అమలు తాలుకు ఫలితాలెలా ఉన్నాయన్న దానిపై సమీక్ష చేయాల్సి ఉందని వివరించారు. ఏజీ చెప్పిన వివరాలను పరిగణనలోకి తీసుకుని విచారణను నాలుగు వారాలకు వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. ఈ సమయంలో పిటిషనర్ల తరఫు న్యాయవాదులు స్పందిస్తూ.. ఈ వ్యాజ్యాలపై అత్యవసర విచారణ జరపాల్సిన అవసరం ఉందని, విచారణను రెండు వారాలకు వాయిదా వేయాలని కోరారు. కానీ, ఈ వ్యవహారంలో ఎలాంటి స్టే ఇచ్చేదిలేదని ధర్మాసనం స్పష్టంచేసింది.

సీఐడీ కేసును కొట్టేయండి

• అరెస్ట్ నుంచి రక్షణ కల్పించండి
• హైకోర్టులో చింతకాయల విజయ్ పిటిషన్

సాక్షి, అమరావతి : హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సీఐడీ అధికారులు తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ టీడీపీ సీనియర్ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు కుమారుడు చింతకాయల విజయ్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య మంగళవారం విచారణ జరిపారు. ఈ వ్యవహారానికి సంబంధించి పూర్తి వివరాలు తమ ముందుంచాలని సీఐడీని ఆదేశించారు. తదుపరి విచారణను 15కి వాయిదా వేశారు. అంతకు ముందు పిటిషనర్ తరఫు న్యాయవాది వీవీ సతీష్ వాదనలు వినిపిస్తూ.. నకిలీ అశ్లీల వీడియోను సృష్టించి, టీడీపీకి చెందిన ఐ టీడీపీ గ్రూప్‌లో వ్యాప్తి చేసి తన పరువు, ప్రతిష్టలకు భంగం కలిగిస్తున్నారంటూ గోరంట్ల మాధవ్ సీఐడీకి ఫిర్యాదు చేశారని తెలిపారు. వాస్తవానికి యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) ఫోన్ నంబర్ సాయంతో ఆ వీడియోను ఐ టీడీపీ గ్రూప్‌లో అప్‌లోడ్ చేశారని, దాంతో పిటిషనర్‌కు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. ఈ కేసులో విజయ్‌ను అరెస్ట్ చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని, అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని అభ్యర్థించారు.

నారాయణ స్వాహా..

బంధుగణంతో 'అసైన్డ్' మేత

సాక్షి, అమరావతి: రాజధాని అమరావతి ముసుగులో టీడీపీ పెద్దల మరో భూబాగోతం బట్టబయలైంది. దళితులు, బలహీన వర్గాలకు చెందిన 1,110 ఎకరాల అసైన్డ్, లంక భూములను కొల్లగొట్టిన వ్యవహారం వెలుగు చూసింది. చంద్రబాబు సర్కారు అక్రమాల చిట్టాను సీఐడీ అధికారులు ఆధారాలతో సహా వెలికితీశారు. అసైన్డ్ భూముల దోపిడీ వ్యవహారంపై దుగ్గిరాలకు చెందిన వై.ప్రసాద్‌కుమార్ ఫిర్యాదు మేరకు సీఐడీ కేసు నమోదు చేసి చేపట్టిన దర్యాప్తులో మొత్తం అక్రమాల బండారం బయటపడింది. దళితులను బెదిరించి అసైన్డ్ భూములను కాజేయడంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు సన్నిహితుడు, బినామీగా గుర్తింపు పొందిన మాజీ మంత్రి పొంగూరు నారాయణే కీలకంగా వ్యవహరించారు. రామకృష్ణా హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా నారాయణ తన కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితుల పేరిట 169.27 ఎకరాల అసైన్డ్ భూములను కొల్లగొట్టినట్లు తేలింది. ఇందులో నారాయణతోపాటు మాజీ మంత్రి గంటా పాత్ర కూడా స్పష్టంగా వెలుగులోకి వస్తోంది.

పలు సెక్షన్ల కింద కేసులు.. ఐదుగురి అరెస్టు

అసైన్డ్ భూములను హస్తగతం చేసుకున్న కేసులో మాజీ మంత్రి పి.నారాయణను ప్రధాన నిందితుడిగా పేర్కొంటూ అసైన్డ్ భూముల బదిలీ నిషేధిత చట్టం 1977, ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టంతో పాటు 409, 420, 506 తదితర సెక్షన్ల కింద సీఐడీ అధికారులు తాజాగా కేసులు నమోదు చేశారు. ఈ కుంభకోణంలో పాత్రధారులుగా వ్యవహరించిన నారాయణ సన్నిహితులైన ఐదుగురిని సీఐడీ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. రామకృష్ణా హౌసింగ్ లిమిటెడ్ సిబ్బంది కొల్లి శివరామ్, గట్టెం వెంకటేశ్‌ను రాత్రి విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానంలో హాజరు పరచగా 41 ఏ సీఆర్‌పీసీ కింద నోటీసులిచ్చి దర్యాప్తు కొనసాగించాలని న్యాయమూర్తి ఆదేశించారు. మరో ముగ్గురు నిందితులను విశాఖలో అరెస్టు చేసి విజయవాడ తరలించారు.

పరిహారం రాదంటూ ఫలహారం..

టీడీపీ హయాంలో పురపాలక శాఖ మంత్రిగా వ్యవహరించిన నారాయణ కనుసన్నల్లోనే భూ దందాలు జరిగాయి. ప్రధానంగా టీడీపీ పెద్దల కళ్లు అమరావతిలోని 1,100 ఎకరాల అసైన్డ్, పోరంబోకు, లంక భూములపై పడ్డాయి. అవన్నీ దళితులు, బలహీన వర్గాలకు చెందినవే. అసైన్డ్ భూముల క్రయ విక్రయాలు చట్ట విరుద్ధమని అప్పటి సీఆర్‌డీఏ కమిషనర్, గుంటూరు కలెక్టర్‌లతోపాటు పలువురు అధికారులు నారాయణకు వివరించినా ఖాతరు చేయలేదు. వాటిని సొంతం చేసుకునేందుకు పక్కాగా పథకం వేశారు. రాజధాని కోసం అసైన్డ్ భూములను ప్రభుత్వం ఎలాంటి పరిహారం చెల్లించకుండా తీసుకుంటుందని రెవెన్యూ, పురపాలక శాఖ అధికారుల ద్వారా ప్రచారం చేయించారు. నారాయణ ఆదేశాలతో అధికారులు గ్రామాల్లో పర్యటించి కేవలం పట్టా భూములకే సర్వేలు చేశారు. అసైన్డ్ భూములకు ఎలాంటి పరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం తీసుకుంటుంది కాబట్టి సర్వే చేయడం లేదని అధికారులతో ప్రచారం చేయించారు. ఇదే అదనుగా నిరు పేదలైన దళితులు, బీసీల భయాందోళనలను సొమ్ము చేసుకునేందుకు నారాయణ తన సమీప బంధువైన కేపీపీ అంజని కుమార్ డైరెక్టర్‌గా ఉన్న రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే రియల్ ఎస్టేట్ సంస్థను రంగంలోకి దించారు. అసైన్డ్ భూములను తాము కొనుగోలు చేస్తామని, లేదంటే అవన్నీ ప్రభుత్వ పరమైపోతాయని రియల్ ఎస్టేట్ సంస్థ ప్రతినిధులు పేదలను నమ్మించారు. వారిని బెదిరించి అతి తక్కువ ధరకు వాటిని తమపరం చేసుకున్నారు. నారాయణ అందుకోసం రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్ బ్యాంకు ఖాతాల ద్వారా లావాదేవీలు నిర్వహించారు. అసైన్డ్ భూములున్న వారికి నగదు చెల్లింపులు చేసి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ(జీపీఏ) పొందారు. అనంతరం సేల్ డీడ్‌ల ద్వారా కథ నడిపించారు.

వియ్యంకుడితో భూ విందు!

అమరావతిలో టీడీపీ పెద్దలు కొల్లగొట్టిన 1,100 ఎకరాల్లో 169.27 ఎకరాల అసైన్డ్ భూములను మాజీ మంత్రి పొంగూరు నారాయణ తన బంధువులు, సన్నిహితుల పేరిట దక్కించుకున్నట్లు సీఐడీ అధికారులు గుర్తించారు. అందులో 89.90 ఎకరాలను బంధువుల పేరిట నారాయణ కొల్లగొట్టగా మరో 79.45 ఎకరాలను ఆయన వియ్యంకుడు, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు సమీప బంధువుల పేరిట గుప్పిట పట్టారు. నారాయణ కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల నుంచి రూ.15 కోట్లు రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు బదలాయించి అసైన్డ్ భూములను కాజేసినట్లు సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. కాగా 1,100 ఎకరాల అసైన్డ్, పోరంబోకు, లంక భూముల్లో మిగిలినవి టీడీపీ ముఖ్యులు, వారి కుటుంబ సభ్యులు, బినామీల పేరిట ఉన్నాయి. వాటిపై సీఐడీ దర్యాప్తు కొనసాగుతోంది.

ఇటు కాజేసి.. అటు లాగేసి!

మాజీ మంత్రి నారాయణ తన బంధువులు, సన్నిహితుల ద్వారా 89.90 ఎకరాల అసైన్డ్ భూములను కొల్లగొట్టారు. రిజిస్ట్రేషన్ చట్టం 22-ఏ కింద నిషేధిత భూముల జాబితాలో ఉన్న వీటిని పకడ్బందీగా సొంతం చేసుకున్నారు. ఈ భూములు అమరావతిలోని అనంతవరం, కృష్ణాయపాలెం, కురగల్లు, లింగాయపాలెం, మందడం, నెక్కల్లు, నవులూరు, రాయపూడి, తుళ్లూరు, ఉద్దండరాయునిపాలెం, వెంకటపాలెం పరిధిలో ఉన్నాయి. నారాయణ వీటిని 84 సేల్ డీడ్ల ద్వారా తన బంధువులు, సన్నిహితులైన ధూళిపాళ్ల వెంకట శివ పానకాలరావు, ఆయన భార్య పద్మావతి, కోడలు డి.సృజన, లక్ష్మిశెట్టి సుజాత, లక్ష్మిశెట్టి సూర్య నారాయణ, అంబటి సీతారాము, లక్కాకుల హరిబాబు, లక్కాకుల పద్మావతి, చిక్కాల విజయ సారథి, పరుచూరి వెంకయ్య భాస్కరరావు, పరుచూరి వి.ప్రభాకరరావు (గంటా బంధువులు), కొండయ్య బాలసుబ్రహ్మణ్యం, భార్య కొండయ్య విజయ, కొండయ్య వెంకటేశ్ తదితరుల పేర్లతో కొనుగోలు చేశారు. నారాయణ తన బంధువులు, సన్నిహితులైన యాగంటి శ్రీకాంత్, కొల్లి శివరామ్, గుమ్మడి సురేశ్ పేరిట ఏకంగా 72 జీపీఏలు చేసి మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సమర్పించారు. నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేసేందుకు అప్పటి సబ్ రిజిస్ట్రార్ ఏ.గోపాల్ నిరాకరించారు. ఆయనపై టీడీపీ పెద్దలు ఎంత ఒత్తిడి తెచ్చినా సమ్మతించలేదు. దీంతో అసైన్డ్ భూములపై తాము చేసుకున్న సేల్ డీడ్ల ఆధారంగానే ఆ భూములను నారాయణ బంధువులు హస్తగతం చేసుకున్నారు. అనంతరం ఆ అసైన్డ్ భూములను రాజధాని కోసం ప్రభుత్వం సమీకరించినప్పుడు వాటిని తామే సీఆర్‌డీయేకు ఇచ్చినట్లుగా చూపించారు. అందుకు ప్రతిగా రాజధాని ప్రాంతంలో అభివృద్ధి చేసిన ప్లాట్లు, వాణిజ్య స్థలాలు పొందే జాబితాలో తమ పేర్లు ఉండేలా చేసుకున్నారు. తద్వారా భూసమీకరణ కింద ఇచ్చిన భూములకు ప్రతిగా ఎకరానికి 800 గజాల నివాస స్థలం, వంద గజాల వాణిజ్య స్థలాన్ని రాజధాని ప్రాంతంలో తమకు వచ్చేటట్లు చూసుకున్నారు.

సీఐడీ అరెస్టు చేసిన ఐదుగురు నిందితులు

▲ కొల్లి శివరామ్, విజయవాడ (రామకృష్ణా హౌసింగ్ లిమిటెడ్ ఉద్యోగి)
▲ గట్టెం వెంకటేశ్, విజయవాడ (రామకృష్ణా హౌసింగ్ లిమిటెడ్ ఉద్యోగి)
▲ చిక్కాల విజయ సారథి, విశాఖపట్నం
▲ బడే ఆంజనేయులు, విశాఖపట్నం
▲ కొట్టి కృష్ణ దొరబాబు, విశాఖపట్నం

గంటా కోటాలో మరో 79.47 ఎకరాలు

అమరావతిలో మరో 79.47 ఎకరాల అసైన్డ్ భూములను కూడా నారాయణ తన వియ్యంకుడైన గంటా శ్రీనివాసరావు బంధువులు, సన్నిహితుల ద్వారా దక్కించుకున్నారు. బోరుపాలెం, కురగల్లు, లింగాయపాలెం, మందడం, నెక్కల్లు, నేలపాడు, నవులూరు, రాయపూడి, తుళ్లూరు, ఉద్దండరాయునిపాలెం, వెంకటపాలెంలోని వివిధ సర్వే నంబర్లలో 79.47 ఎకరాలను 76 సేల్ డీడ్ల ద్వారా తమపరం చేసుకున్నారు. కొట్టి కృష్ణ దొరబాబు, గుమ్మడి సురేశ్, కొల్లి శివరామ్‌లు వాటిపై జీపీఏ ఒప్పందాలు చేసుకుని ఆ భూములు తమకు చెందినవని చూపారు. దళారీలు కొమ్మారెడ్డి బ్రహ్మానందరెడ్డి, గుమ్మడి సురేశ్, సఫియుల్ రహమాన్, పొట్లూరి జయంత్, ఆల వెంకట సుబ్బయ్య, పిడపర్తి టిటుస్ బాబు, శీలం శ్రీనివాసరావు తదితరులు ఈ అసైన్డ్ భూములను నారాయణ తన బంధుగణం ద్వారా దక్కించుకోవడంలో పాత్ర పోషించారు. కాగా సీఐడీ అధికారులు అరెస్టు చేసిన కొట్టి కృష్ణ దొరబాబు మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుకు నమ్మిన బంటు కావడం గమనార్హం. టీడీపీ హయాంలో గంటా మంత్రిగా ఉండగా ఆయన్ను ఆంధ్రా వర్సిటీ దూరవిద్యా కేంద్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కాంట్రాక్టు విధానంలో నియమించారు. జాగ్రఫీలో పీహెచ్‌డీ చేసిన ఆయన ఉద్యోగం పొందిన సమయంలో వర్సిటీలో అలాంటి కోర్సు లేకున్నా అవకాశం కల్పించారు.

టీడీపీ నేత నారాయణకు బెయిల్ చట్టబద్ధం కాదు

చిత్తూరు న్యాయస్థానంలో ఏఏజీ సుధాకర్‌రెడ్డి ఆక్షేపణ

చిత్తూరు అర్బన్: పదో తరగతి ప్రశ్నపత్రం మాల్‌ప్రాక్టీస్ వ్యవహారంలో టీడీపీ నేత, మాజీ మంత్రి నారాయణకు మేజిస్ట్రేట్ కోర్టు బెయిల్ మంజూరు చేయడం చట్టబద్ధం కాదని రాష్ట్ర అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) సుధాకర్‌రెడ్డి ఆక్షేపించారు. చిత్తూరులో ఈ ఏడాది పదో తరగతి ప్రశ్నపత్రం మాల్‌ప్రాక్టీస్ వ్యవహారంలో నారాయణ విద్యా సంస్థలకు చెందిన పలువురు ఉపాధ్యాయులను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. టీడీపీ నేత, మాజీ మంత్రి నారాయణను కూడా హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. అయితే అదే రోజు చిత్తూరు న్యాయస్థానం నారాయణకు బెయిల్ ఇచ్చింది. దీన్ని రద్దు చేయాలంటూ ప్రాసిక్యూషన్ జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై ఇప్పటికే చిత్తూరులోని 9వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి తన వాదనలు వినిపించారు. నారాయణ తరఫున మంగళవారం డి. రమేష్ తన వాదనలు వినిపించారు. నారాయణకు బెయిల్ చట్టపరిధిలోనిదేనని తెలిపారు. దీనిపై ఏఏజీ సుధాకర్‌రెడ్డి అభ్యంతరం తెలుపుతూ తన వాదనలు మరోమారు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న సెషన్స్ కోర్టు జడ్జి విచారణను ఈ నెల 20కి వాయిదా వేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

శ్రీశైలానికి పెరిగిన వరద

మూడు లక్షల క్యూసెక్కుల ప్రవాహం


సాక్షి, అమరావతి/శ్రీశైలం ప్రాజెక్టు/విజయపురిసౌత్: పరివాహక ప్రాంతాల్లో (బేసిన్‌లో) విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా, వంశధార, నాగావళి నదుల్లో వరద ఉద్ధృతి పెరిగింది. పెన్నానదిలో వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. శ్రీశైలం ప్రాజెక్టులోకి మంగళవారం సాయంత్రం 6 గంటలకు 3,00,847 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు 8 వేలు, హంద్రీ–నీవాకు 1,013, కల్వకుర్తికి 800 క్యూసెక్కులు తరలిస్తున్నారు. 884.7 అడుగుల్లో 213.38 టీఎంసీలను నిల్వచేస్తూ స్పిల్ వే తొమ్మిదిగేట్లను 10 అడుగులు ఎత్తి 2,51,433, కుడి, ఎడమ గట్టు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 62,537 కలిపి 3,13,970 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు 16 గేట్లను 10 అడుగులు ఎత్తి వచ్చిన వరదను వచ్చినట్లు కిందికి వదులుతున్నారు. పులిచింతలకు చేరుతున్న వరదను చేరుతున్నట్లుగా స్పిల్ వే, విద్యుత్ కేంద్రాల ద్వారా దిగువకు వదిలేస్తున్నారు. దీంతో ప్రకాశం బ్యారేజ్‌లోకి వరద స్థిరంగా కొనసాగుతోంది. ప్రకాశం బ్యారేజ్‌లోకి 2,99,478 క్యూసెక్కులు చేరుతుండగా.. కృష్ణా డెల్టాకు 10,728 క్యూసెక్కులు విడుదల చేస్తూ.. 2,96,625 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు.

ధవళేశ్వరం వద్ద గోదావరి దూకుడు

- 11.58 లక్షల క్యూసెక్కుల ప్రవాహం
- మొదటి ప్రమాద హెచ్చరిక జారీ.. నేడు వరద మరింత పెరిగే అవకాశం

సాక్షి, అమరావతి/ధవళేశ్వరం/పోలవరం/కూనవరం(అల్లూరి సీతారామరాజు జిల్లా): తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద గోదావరి వరద ఉద్ధృతి మరింతగా పెరిగింది. మంగళవారం రాత్రి 9 గంటలకు 11,58,927 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. నీటిమట్టం 13 అడుగులకు చేరింది. గోదావరి డెల్టాకు 3,900 క్యూసెక్కులు విడుదల చేస్తూ మిగిలిన 11,55,027 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు నీటిమట్టం 11.75 అడుగులు దాటడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేసిన అధికారులు దిగువన లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. ఎగువ నుంచి భద్రాచలం వద్దకు మంగళవారం రాత్రి 7 గంటలకు 13,55,586 క్యూసెక్కుల ప్రవాహం చేరుతుండటంతో నీటిమట్టం 51.7 అడుగులకు చేరుకుంది. దీంతో రెండో ప్రమాద హెచ్చరికను జారీచేశారు. నీటిమట్టం 53 అడుగులను దాటితే మూడో ప్రమాద హెచ్చరికను జారీచేస్తారు. మంగళవారం వర్షాలు కొనసాగడంతో గోదావరి బేసిన్‌లో ఎగువన వరద స్థిరంగా కొనసాగుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బ్యారేజ్ నుంచి 9,89,625 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తుండగా దుమ్ముగూడెం సమీపంలోని సీతమ్మసాగర్ వద్దకు 13,11,731 క్యూసెక్కుల ప్రవాహం చేరుతోంది. సీతమ్మసాగర్ నుంచి వచ్చిన వరదను వచ్చినట్లు దిగువకు వదిలేస్తున్నారు. వాటికి వాగులు, వంకల వరద తోడవుతుండటంతో భద్రాచలం వద్దకు బుధవారం 17 లక్షల క్యూసెక్కుల వరద వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువ నుంచి భారీ వరద వస్తుండటంతో పోలవరం వద్ద 24 గంటలు అప్రమత్తంగా ఉంటున్న అధికారులు వచ్చిన వరదను వచ్చినట్లుగా దిగువకు వదిలేస్తూ.. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

పోలవరం వద్ద 33.380 మీటర్లకు నీటిమట్టం



పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద మంగళవారం సాయంత్రానికి గోదావరి నీటిమట్టం 33.380 మీటర్లకు చేరుకుంది. స్పిల్‌వే 48 గేట్ల నుంచి నీటిని దిగువకు వదిలేస్తున్నారు. ప్రాజెక్టు ప్రాంతానికి వెళ్లే ప్రధాన రోడ్డుమార్గంలోని కడెమ్మ వంతెనకు ఇరువైపులా వరదనీరు చేరింది. కాగా, గోదావరి ఉద్ధృతికి శబరి నది తోడవడంతో విలీన మండలాలు ముంపునకు గురయ్యాయి. కూనవరంలో ఉదయ్‌భాస్కర్ కాలనీ, గిన్నెలబజారు మంగళవారం ముంపునకు గురయ్యాయి. ముందస్తు చర్యల్లో భాగంగా అధికార యంత్రాంగం సోమవారం అర్ధరాత్రే ఇళ్లను ఖాళీ చేయించి బాధితులను కోతులగుట్ట పునరావాస కాలనీకి తరలించింది. కూనవరం వద్ద గోదావరి మట్టం 48 అడుగులకు చేరింది.

చరిత్రలో ఏడో అతి పెద్ద వరద

ఈ ఏడాది జనవరి 1 నుంచి మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు 4,734 టీఎంసీల గోదావరి జలాలు బంగాళాఖాతంలో కలిశాయి. బంగాళాఖాతంలో ఈ ఏడాది ఇప్పటివరకు కలిసిన గోదావరి జలాలను పరిగణలోకి తీసుకుంటే.. ధవళేశ్వరం బ్యారేజ్ చరిత్రలో గోదావరికి ఈ ఏడాది వచ్చిన ప్రవాహం ఏడో అతిపెద్ద వరద ప్రవాహం. ధవళేశ్వరం బ్యారేజ్ చరిత్రలో గరిష్ఠంగా 1990లో 7,092.285 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలవగా.. ఆ తర్వాత 1994లో 5,959.228 టీఎంసీలు, 2013లో 5,921.9 టీఎంసీలు, 1984లో 4,879.693 టీఎంసీలు, 2006లో 4,841.84 టీఎంసీలు, 1988లో 4,800.839 టీఎంసీలు సముద్రంలో కలిశాయి. గోదావరికి 1986లో ఆగస్టు 16న గరిష్ఠంగా 36 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చినప్పుడు ఆ ఏడాదిలో ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి 3,213.371 టీఎంసీలే సముద్రంలో కలవడం గమనార్హం.

ఉత్తరాంధ్ర నాశనాన్ని కోరతారా?

నిప్పులు చెరిగిన ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



మహారాణిపేట (విశాఖ దక్షిణ): అమరావతి పాదయాత్ర.. ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధిని అడ్డుకునేందుకు దేవుడు పేరుతో చేస్తున్న దెయ్యాల యాత్రగా మారిందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మండిపడ్డారు. చంద్రబాబు సృష్టించిన అమరావతి దెయ్యాల రాజధాని అని ఎద్దేవా చేశారు. మంగళవారం ఆయన విశాఖలో విలేకరులతో మాట్లాడారు. ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా సాగుతున్న ఈ యాత్రలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా దానికి చంద్రబాబే బాధ్యత వహించాలన్నారు. యాత్రకు కోర్టు అనుమతి ఇచ్చింది కదా అని ఏదైనా చేస్తాం.. ఈ ప్రాంత ప్రజలను రెచ్చగొడతాం.. అంటూ రెచ్చిపోతే చూస్తూ ఊరుకోమన్నారు. అమరావతితో పాటు ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందాలని సీఎం జగన్ సంకల్పమన్నారు. మంత్రి ఇంకా ఏమన్నారంటే..

ఉత్తరాంధ్రను ఉత్తి ఆంధ్రగా మార్చలన్నదే వారి కుట్ర

- రాష్ట్ర సమగ్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పరిపాలన వికేంద్రీకరణ చేస్తోంది. యాత్రకు సంఘీభావం తెలిపిన వారంతా ఒకే సామాజిక వర్గం వారు. ఈ విషయం మంగళవారం నాటి ఈనాడు పత్రికే రాసింది. దీన్నిబట్టి ఈ యాత్ర ఎవరి కోసం చేస్తున్నారన్నది అర్థమవుతోంది. కేవలం పెట్టుబడిదారుల కోసమే ఈ యాత్ర సాగుతోంది.
- రాష్ట్రం మొత్తం అభివృద్ధి చెందాలని కాంగ్రెస్, బీజేపీ, కమ్యూనిస్టు పార్టీలకు లేదా? 2018 ఫిబ్రవరి 23న బీజేపీ చేసిన రాయలసీమ డిక్లరేషన్‌లో కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారా.. లేదా? ఉత్తరాంధ్రను ఉత్తి ఆంధ్రగా మార్చాలని చంద్రబాబు చేస్తున్న యత్నాలకు వీరంతా ఎందుకు మద్దతిస్తున్నారు?

దేవుడిని ఏం కోరుకుంటారు?

- మా ప్రాంతానికి వచ్చి మేము కొలిచే అరసవల్లిలో దేవుడికి మొక్కి మాకు కీడు జరగాలని, ఉత్తరాంధ్ర నాశనం అవ్వాలని మీరు కోరుతారా? అటువంటి సంకల్పంతో చేస్తున్న ఈ యాత్రను ఉత్తరాంధ్ర ప్రజలు సహించరు. ఈ యాత్రపై ఏదైనా తిరుగుబాటు జరిగితే చంద్రబాబుదే బాధ్యత.

ఉత్తరాంధ్రకు బాబు ద్రోహం

- 14 ఏళ్ల పాటు సీఎంగా ఉన్న బాబు రాష్ట్రానికి ఏం మేలు చేశారు? 1983 నుంచి జరిగిన ఎన్నికల్లో టీడీపీకి ఉత్తరాంధ్ర ప్రజలు అండగా నిలిచినా ఈ ప్రాంతానికి ఎందుకు ద్రోహం చేయాలని భావిస్తున్నారు? చంద్రబాబుతో కలిసి మిగతా పార్టీల కుట్రలనూ ఉత్తరాంధ్ర ప్రజలు గమనిస్తున్నారు. అవినీతితో చంద్రబాబు సంపాదించుకున్న రూ.లక్షల కోట్లను పదిలంగా ఉంచుకోవడమే లక్ష్యంగా బాబు ఈ యాత్ర చేయిస్తున్నారు.
- 'రాష్ట్రమంటే 29 గ్రామాలు కాదోయ్, రాష్ట్రమంటే 26 జిల్లాలోయ్..' అని చంద్రబాబు గుర్తెరగాలి. 2024లో రాజధాని అంశానికి ముగింపు పడుతుంది. ప్రజలే స్పష్టమైన తీర్పు చెబుతారు. విశాఖలో ప్రభుత్వ భవనాలు నిర్మించడం కూడా తప్పా? ప్రజలు అంతా గమనిస్తున్నారు.

డిపార్టుమెంటల్ టెస్టుకు నేటి నుంచి దరఖాస్తులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల కోసం నిర్వహించే డిపార్టుమెంటల్ టెస్టుకు బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి అరుణ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 4 వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని.. 4వ తేదీ రాత్రి 11.59 గంటల్లోపు ఫీజు చెల్లించాలని సూచించారు. నవంబర్‌లో ఈ పరీక్షలు జరగనున్నాయి.

కాలుష్య నియంత్రణ మండలి తాత్కాలిక చైర్మన్‌గా సీఎస్

సాక్షి, అమరావతి: కాలుష్య నియంత్రణ మండలి తాత్కాలిక చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) డాక్టర్ సమీర్ శర్మ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

కాఫీ బోర్డు సభ్యురాలిగా ఎంపీ మాధవి



సాక్షి, న్యూఢిల్లీ: కాఫీ బోర్డు సభ్యురాలిగా వైఎస్సార్‌సీపీ ఎంపీ గొడ్డేటి మాధవి నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర వాణిజ్య శాఖ మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. కాఫీ బోర్డును పునర్‌నియమిస్తూ విడుదల చేసిన ఈ నోటిఫికేషన్‌లో సభ్యులుగా ఎంపీ ప్రతాప్ సిన్హా, రాజ్యసభ సభ్యుడు ఎస్.చంద్రశేఖరన్ కూడా ఉన్నారు. కాఫీ సాగు చేసే రాష్ట్రాల ప్రభుత్వ ప్రతినిధుల విభాగంలో ఏపీ గిరిజన సంక్షేమ విభాగం కార్యదర్శి కాంతిలాల్‌దండే, కాఫీ పండించే వారి విభాగంలో విశాఖ జిల్లా దోమంగికి చెందిన విశ్వనాథం, కొత్తపాడేరుకు చెందిన కురుస ఉమామహేశ్వరరావు, వాణిజ్య విభాగంలో విశాఖ జిల్లా కిన్నెర్లకు చెందిన జయతు ప్రభాకర్‌రావు, ఇన్‌స్టంట్ కాఫీ ఉత్పత్తిదారుల విభాగంలో హైదరాబాద్‌కు చెందిన చల్లా శ్రీశాంత్‌లను వాణిజ్య శాఖ సభ్యులుగా నియమించింది.

ఆ వ్యాఖ్యల వెనుక బాబు రహస్య అజెండా

- 'రాయలసీమకు చుక్క నీరు ఇవ్వం' అనడం రెచ్చగొట్టడం కాదా?
- రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలంటే ఎందుకంత ద్వేషం?
- బాబు కట్టిన అమరావతిలో టీ, భోజనానికి దిక్కులేదు
- అన్ని విషయాలపై చర్చిద్దాం.. దమ్ముంటే చంద్రబాబు అసెంబ్లీకి రావాలి
- వైఎస్సార్‌సీపీ శాసన సభ్యుడు గడికోట శ్రీకాంత్ రెడ్డి ధ్వజం

సాక్షి, అమరావతి: 'రాయలసీమకు చుక్క నీరు ఇవ్వం' అంటూ అమరావతి యాత్రికులు చేసిన వ్యాఖ్యల వెనుక చంద్రబాబు రహస్య అజెండా ఉందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, రాష్ట్ర అధికార ప్రతినిధి గడికోట శ్రీకాంత్‌రెడ్డి చెప్పారు. అమరావతి యాత్ర పేరుతో ప్రజల మధ్య, ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తున్న చంద్రబాబు బండారాన్ని రాష్ట్ర ప్రజల దృష్టికి తేవాలన్నదే తన ఉద్దేశమన్నారు. అమరావతి పాదయాత్రలో వారు మాట్లాడిన మాటలు సీమ వాసిగా, ఆ ప్రాంత ప్రజా ప్రతినిధిగా తనను బాధించాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడు రాజధానులు ఏర్పాటు చేస్తే, తాము మధ్యాంధ్రప్రదేశ్ పేరిట ఉద్యమించాల్సి ఉంటుందన్న వారి మాటల వెనుక కచ్చితంగా చంద్రబాబు ఉన్నారని అర్థమవుతోందన్నారు. శ్రీకాంత్‌రెడ్డి ఇంకా ఏమన్నారంటే..

పసుపు కండువాలతో యాత్ర చేయండి

- కృష్ణా నది నీళ్లు ఎక్కడి నుంచి వస్తున్నాయో మీకు తెలుసా? శ్రీశైలం ప్రాజెక్టు కోసం మేము త్యాగం చేసి, మీకు నీళ్లు ఇస్తుంటే, రాయలసీమకు చుక్క నీరు ఇవ్వం అని విద్వేషాలు రెచ్చగొడతారా? రాయలసీమకు న్యాయ రాజధాని వస్తే చంద్రబాబుకు వచ్చిన నష్టమేమిటో అర్థం కావడం లేదు.
- చంద్రబాబుకు అధికారమే పరమావధి. రాష్ట్ర విభజనకు మూల కారకుడయ్యారు. ఈరోజు రాష్ట్రం అభివృద్ధి చెందకుండా అడ్డుపడుతున్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలంటే చంద్రబాబుకు ద్వేషం. రైతుల ముసుగులో గ్రీన్ కండువాలు ఎందుకు.. పచ్చ కండువాలతో యాత్ర చేయండి. ఐదేళ్లు అధికారంలో ఉండి అమరావతిలో ఒక్క హోటల్ కట్టావా బాబూ? అక్కడ టీ తాగాలన్నా, భోజనం చేయాలన్నా దిక్కు లేదు. రాష్ట్రంలో అశాంతి, అలజడులు సృష్టిద్దామనుకుంటే చూస్తూ ఊరుకోం.



చంద్రబాబు కాలంలో నక్సలిజం, కరువు కాటకాలు

- 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు, రాష్ట్రాన్ని కరువు ఆంధ్రప్రదేశ్‌గా మార్చారు. నిస్సిగ్గుగా అబద్ధాలు చెప్పడంలో దిట్ట. ఆయన పాలన తొలి నాళ్లలో నక్సలిజం, కరువు కాటకాలు, క్షీణించిన శాంతిభద్రతలతో రాష్ట్రం తల్లడిల్లింది.
- దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ అధికారం చేపట్టాక, వాటన్నింటినీ చక్కదిద్ది రాష్ట్రానికి సరికొత్త దశ, దిశ నిర్దేశిస్తూ, సంక్షేమ రాజ్యాన్ని నెలకొల్పారు. వ్యవసాయం దండగ అని బాబు అంటే.. కాదు పండుగ అని నిరూపించారు.
- రాష్ట్ర విభజన తర్వాత ప్రజలను మభ్యపెట్టి అధికారం చేపట్టిన చంద్రబాబు, ఓటుకు కోట్లు కేసులో అడ్డంగా దొరికిపోయారు. దాని నుంచి తప్పించుకునేందుకు అమరావతి బాట పట్టారు. సినిమా సెట్టింగులు మాదిరిగా గ్రాఫిక్స్ చూపించి, డల్లాస్, సింగపూర్, మలేషియా చేస్తానని చెప్పి ప్రజలను మభ్య పెట్టారు. నిపుణుల మాటలను లెక్క చేయకుండా ఇక్కడి రైతులనూ మోసం చేశారు. ప్రజలు 2019లో అధికారం ఊడగొట్టినా బుద్ధి రాలేదు.
- హైదరాబాద్‌లో రింగ్ రోడ్డు, ఎయిర్‌పోర్ట్, సాఫ్ట్‌వేర్ అన్నీ తన ఘనతేనని చెప్పుకుంటారు. అవుటర్ రింగు రోడ్డు, ఎయిర్ పోర్టుకు శంకుస్థాపన చేసి, ప్రారంభించిన నేత వైఎస్సార్. నేదురుమల్లి జనార్దనరెడ్డి హైటెక్ సిటీకి శంకుస్థాపన చేశారు. వైఎస్సార్ రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి, జలయజ్ఞం పేరుతో 86 ప్రాజెక్టులు ప్రారంభించారు.
- శ్రీ బాగ్ ఒప్పందం ప్రకారం కర్నూలులో న్యాయ రాజధాని హక్కుగా రావాల్సి ఉన్నా దానికీ బాబు అడ్డుపడుతున్నారు. రాయలసీమ అంటే విషం కక్కుతున్నారు. పరిశ్రమలు, పెట్టుబడులు, ఇతరత్రా అన్ని విషయాలపై అసెంబ్లీలో చర్చిద్దామంటే రాకుండా పారిపోతారు.

అది పాదయాత్ర కాదు.. టీడీపీ శవయాత్ర

- చచ్చిపోయిన పార్టీని బతికించడానికి సృష్టించిన యాత్ర
- మద్దతు తెలిపిన వారంతా ఓ సామాజిక నిర్మాతలని టీడీపీ గెజిట్ 'ఈనాడే' చెప్పింది : మంత్రి జోగి రమేష్



సాక్షి, అమరావతి: రైతుల పేరుతో అమరావతి నుంచి అరసవల్లి దాకా చంద్రబాబు చేయిస్తున్న పాదయాత్ర.. రాజకీయంగా టీడీపీకి శవయాత్రగా మారబోతోందని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో టీడీపీకి నూకలు చెల్లాయని.. తాళ్లు కట్టి ప్రొక్లెయిన్‌లతో లేపినా చంద్రబాబు రాజకీయంగా నిలబడలేరు కాబట్టి అమరావతి పేరుతో కృత్రిమ యాత్ర సృష్టించారని ధ్వజమెత్తారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కమీషన్ల కోసం పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు ఎలా ఏటీఎంగా వాడుకున్నారో.. అమరావతిని అదే రీతిలో ఏటీఎంగా వాడుకుంటున్నారని దుయ్యబట్టారు. అధికారంలో ఉన్నప్పుడు అమరావతి పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి, కోట్లాది రూపాయలు దోచుకున్న చంద్రబాబు.. ఇప్పుడు అదే పేరుతో అమరావతి నుంచి అమెరికా దాకా వసూళ్లు చేస్తూ దోచుకుంటున్నారని ఆరోపించారు. మంత్రి జోగి రమేష్ ఇంకా ఏమన్నారంటే..

చంద్రబాబు ఎంపిక చేసిన వారితోనే పాదయాత్ర

- అమరావతి పాదయాత్రలో ఆడవారే ఎందుకు పాల్గొంటున్నారు? మగవారు, రైతులు లేరా? పాదయాత్రకు చంద్రబాబు సెలెక్ట్ (ఎంపిక) చేసిన వారంతా ఎవరు? వారు ఏ కులం వారు?
- అమరావతి పాదయాత్రలో ఒక కులం మీద మేము నిందలు వేయట్లేదు. టీడీపీ గెజిట్ ఈనాడులోనే మంగళవారం అమరావతి యాత్రకు మద్దతు తెలిపిన వారి గురించి ఫొటోలతో సహా వివరంగా రాశారు. సీపీఐ నారాయణ, రేణుకాచౌదరి, చింతమనేని ప్రభాకర్, దేవినేని ఉమా, కామినేని శ్రీనివాస్, పాతూరి నాగభూషణం వీరంతా ఎవరు? ఏ సామాజిక నిర్మాతలు? ఈ ఉద్యమానికి.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, కాపులకు అసలు సంబంధం ఉందా? కేవలం చంద్రబాబు సామాజిక వర్గం మాత్రమే అమరావతి రాజధానిగా ఉండాలంటోంది.

ఎవరు ద్రోహం చేశారో తేలుద్దాం.. అసెంబ్లీకి రండి

- ఎవరు సామాజిక న్యాయం చేశారో.. ఎవరు సామాజిక ద్రోహం చేశారో తేలుద్దాం. చంద్రబాబూ.. అసెంబ్లీకి రండి.
- చంద్రబాబు చెబుతున్నట్లు అమరావతి అభివృద్ధికి రూ.లక్షల కోట్లు కుమ్మరిస్తే ఉపయోగం ఎవరికి?పాఠశాలల్లో నాడు–నేడు, అమ్మ ఒడి, విద్యా కానుక, విద్యా దీవెన, వసతి దీవెన ఇచ్చి సీఎం జగన్ పేద పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కా చెల్లెమ్మలకు ఆసరా ఇస్తూ.. రైతన్నకు భరోసా కల్పిస్తూ.. వృద్ధులకు పెన్షన్ ఇస్తూ ఆదుకుంటున్నారు. ఇదీ అభివృద్ధి అంటే.
- ప్రజల ఆకాంక్షల మేరకు శాసన రాజధానిగా అమరావతి, న్యాయ రాజధానిగా కర్నూలు, కార్యానిర్వాహక రాజధానిగా విశాఖపట్నంలను అభివృద్ధి చేయాలని సీఎం నిర్ణయించారు. ఈ నిర్ణయాన్ని ప్రజలు ఆమోదిస్తూ.. 2019 ఎన్నికల తర్వాత జరిగిన ప్రతి ఎన్నికలోనూ వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించారు.
- చంద్రబాబు. లోకేశ్‌లు సీఎం జగన్ గురించి, ఆయన కుటుంబం గురించి తప్పుగా మాట్లాడితే తాటతీస్తాం.

'చింతూరు డివిజన్' ఏర్పాటుపై నోటిఫికేషన్

చింతూరు(అల్లూరి సీతారామరాజు జిల్లా): చింతూరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై సూచనలు, అభ్యంతరాల స్వీకరణకు ప్రభుత్వం మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సంబంధించి చింతూరు, కూనవరం, ఎటపాక, వీఆర్‌పురం మండలాల ప్రజలు 30 రోజుల్లోపు తమ సూచనలు, అభ్యంతరాలను తెలుగు లేదా ఇంగ్లిష్‌లో కలెక్టర్‌కు తెలియజేయాలని నోటిఫికేషన్‌లో సూచించింది.

టీచర్లు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

పాఠశాల విద్య కమిషనర్ సురేష్‌కుమార్

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులుగా ఉండాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ సూచించారు. ఏపీ ఎస్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో 'సాల్ట్' కింద టీచర్లకు మంగళవారం ఆన్‌లైన్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎస్.సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులు సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగించుకుని అనేక అంశాలపై సొంతంగా అవగాహన పొందుతున్నారు. ఇందుకనుగుణంగా ఉపాధ్యాయులు సిద్ధంగా ఉండాలి' అని సూచించారు. ఏపీ ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ బైజుస్‌తో ఒప్పందం నేపథ్యంలో డిజిటల్ బోధన వల్ల ఉపాధ్యాయ పోస్టులు కుదిస్తారనే ప్రచారంలో వాస్తవం లేదని చెప్పారు.

బీజేపీ 18 నెలల పోరుబాట : సోము

సాక్షి, అమరావతి: 2024లో రాష్ట్రంలోను బీజేపీని అధికారంలో తీసుకొచ్చే లక్ష్యంగా వచ్చే 18 నెలల పాటు పోరుబాట పేరుతో కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణను సిద్ధం చేసినట్టు ఆ పార్టీ అధ్యక్షుడు సోము వీర్రాజు చెప్పారు. ఇందులో భాగంగా 19 నుంచి అక్టోబరు 2వ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఐదువేల గ్రామాల్లో సభలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆయన సోమవారం విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 30–40 సభలు నిర్వహిస్తామన్నారు. సభల్లో పార్టీ నేతలు ఏం మాట్లాడాలనే దానిపై శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఏ గ్రామంలో ఎవరి ఆధ్వర్యంలో సభలు నిర్వహించాలో సెంటర్ ఇన్‌చార్జీల పేర్లనూ తయారు చేసినట్లు తెలిపారు. ఈ సభల్లో పార్టీ నేతలు, కేంద్రమంత్రులు పాల్గొంటారని చెప్పారు. ఎన్నికల ముందు పాదయాత్రలో జగన్ అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా స్థానిక అంశాలపై ఇచ్చిన హామీలు, ఏవి నెరవేర్చారనే దానిపై ఆయా నియోజకవర్గాల్లో చర్చకు పెడతామని ఆయన తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.